PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 199 | విజయవాడ, సోమవారం 20 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 20 February 2023 | Rs



బ్లూటిక్ బాదుడు

- త్వరలో ఫేస్‌బుక్‌లోనూ చార్జీలు
- ఎలన్ మస్క్ బాటలో జుకర్‌బర్గ్

లోపలి పేజీల్లో...



జడేజా మాయాజాలం

- రెండో టెస్టులో ఆస్ట్రేలియాపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు

లోపలి పేజీల్లో...

జీఓ 1 రద్దు కోసం చలో అసెంబ్లీ

రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం ఉధృతం • జిల్లాల్లో సదస్సులు • గవర్నర్‌కు వినతిపత్రం • పోరాట కమిటీ రాష్ట్ర సదస్సులో తీర్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబరు1ని రద్దు చేయకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని, ఈ జీఓను రద్దు చేసేంతవరకు రాష్ట్రంలో వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టాలని జీఓ నెంబరు1ని రద్దు పోరాట కమిటీ రాష్ట్ర సదస్సు డిక్లరేషన్‌ను ప్రకటించింది. విజయవాడ ఎంబివికెలో ఆదివారం కమిటీ కన్వీనరు ముప్పాళ్ల సుబ్బారావు అధ్యక్షతన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించగా, తీర్మానాలను మరో కన్వీనరు సుంకర రాజేంద్రప్రసాద్ ప్రవేశపెట్టారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా 26 జిల్లాల నుంచి ప్రజలను సమీకరించి చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. దీంతోపాటు జీఓ 1 రద్దుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పాత జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయడంతో పాటు నూతన గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించాలని కూడా సదస్సు తీర్మానించింది.

సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఓ1 రద్దుకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి తమ పూర్తి మద్దతు నిస్తుందన్నారు. విపక్షాల గొంతునొక్కేందుకు వైఎస్ జగన్ తీసుకొచ్చిన జీఓ1 రాబోవు రోజుల్లో ఆయనకు ఉరితాడుగా మారుతుందన్నారు. విపక్షాలు, ప్రజాసంఘాలు చేస్తున్న ఉద్యమాలు శాంతియుతంగా నిర్వహిస్తుంటే ప్రభుత్వమే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ పోలీసులు రోడ్డుకు అడ్డంగా కూర్చోవడమేంటని ఆయన ప్రశ్నించారు. బందరులో ఇద్దరు విద్యార్థినులకు అన్యాయం జరిగిందని వైస్ ఛాన్సెలర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అవమానపరిచే విధంగా ప్రవర్తించడంతో పాటు వారి బట్టలు ఊడదీయడం, వారిని కొట్టడమేంటన ఆయన ప్రశ్నించారు. దెబ్బతిన్న విద్యార్థులను ఆసుపత్రికి తీసుకెళ్ళేందుకు అంబులెన్స్ రాకుండా పోలీసులు గంటకు పైగా అడ్డుకోవడంతో పాటు విద్యార్థులపై ఎదురు కేసులు పెట్టారని వి.శ్రీనివాసరావు తెలిపారు. మోడీ చేస్తున్న అరాచకపాలనకు అనుగుణంగా రాష్ట్రంలో సిఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ జీఓ1పై ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, న్యాయవాదులు ఎన్ని నిరసనలు వ్యక్తం చేసినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదని, హైకోర్టు తీర్పు వచ్చే వరకైనా జీఓ1 అమలు నిలుపు చేయలేదన్నారు. పోలీసులు ఖాకీ డ్రస్ వేసుకున్న పక్కా జీతగాళ్లని, ఐపిఎస్, ఐఎఎస్ అధికారులు సిఎం జగన్‌కు జీతగాళ్లలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిరసన దద్దరిల్లే విధంగా చేపట్టాలన్నారు. చంద్రబాబు నాయుడు గోదావరి జిల్లాల పర్యటనలో మొదటి రెండు రోజులు ప్రశాంతంగాజరగ్గా మూడో రోజు అనపర్తిలో చంద్రబాబును అడ్డుకునేందుకు పోలీసులు వ్యవహరించిన తీరును తప్పుపట్టారు.

జీఓ నెంబర్ వన్ రద్దు పోరాట ఐక్య వేదిక కన్వీనరు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జీఓ1 రద్దు కోసం చేసే పోరాటాలకు ప్రతి ఒక్కరూ కలసి రావాలన్నారు. రాష్ట్రంలో రూల్‌ఆఫ్ లా అమలు కావడం లేదన్నారు. మరో కన్వీనరు ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ జడ్‌ప్లస్ కేటగిరీలోని వ్యక్తి పాతయాత్రగా వెళుతుంటూ అంబులెన్స్, జామర్లతో పాటు భద్రత కల్పించాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరించడమేంటని ఆయన ప్రశ్నించారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో లక్షలాదిమందితో గాంధీజీనడుస్తూ స్వాతంత్ర్య ఉద్యమం చేసినా ఆ ప్రభుత్వం ఈ తరహా జీఓ అమలు చేయలేదన్నారు. పోలీసులు దద్దమ్మలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, పోలీసులు తాము దద్దమ్మలం కాదు, ప్రజారక్షకులమని నిరూపించుకోవాలన్నారు. అరాచక జీఓను రద్దు చేసే మిగతా 2లో



సదస్సులో అభివాదం చేస్తున్న పోరాట కమిటీ నేతలు, రాజకీయ పార్టీల నాయకులు

నీట్‌పై సుప్రీంకు తమిళనాడు

రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని పిటిషన్



న్యూఢిల్లీ : జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)పై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దేశంలో వైద్య కోర్సుల్లో ప్రవేశానికి ఏకైక ప్రవేశమార్గం నీట్ అనేది భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణం, ప్రాథమిక సమానత్వ హక్కును ఉల్లంఘించడం, ఫెడరలిజం సూత్రాలను విస్మరించడంగా ప్రకటించాలని సుప్రీంకోర్టులో తమిళనాడు ప్రభుత్వం శనివారం ఒరిజినల్ సూట్ వేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం వేసిన ఈ పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చింది. 'నీట్‌లో సాధించిన మార్కులే అన్ని వైద్య, అనుబంధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రామాణికం అని చెప్పడం భారత రాజ్యాంగంలోని నిబంధనలు, రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మాణం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఏకపక్షంగా ఉల్లంఘించడమే' అని సుప్రీంకోర్టు ప్రకటించాలని పిటిషన్‌లో తమిళనాడు ప్రభుత్వం కోరింది. 'నీట్ పరీక్షను ప్రవేశపెట్టడం, కొనసాగించడం వల్ల తమిళనాడులోని విద్యార్థులు ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, తమిళనాడు రాష్ట్ర విద్యా మండలి అనుబంధ పాఠశాలల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడడం వలన' సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పిటిషన్‌లో పేర్కొంది. 'నీట్‌తో వైద్య కళాశాలల్లోని ప్రభుత్వ సీట్లలో విద్యార్థులను చేర్చుకునే రాష్ట్రాల అధికారాన్ని హరించడం వల్ల సమాఖ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తుంది. విద్య అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశం. దీనిపై చట్టాలను రూపొందించడం రాష్ట్రాల హక్కు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల కోసం విద్యను నియంత్రించే హక్కు రాష్ట్రాలకు ఉంది. ప్రైవేట్, రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ కళాశాలలు అనే తేడా లేకుండా అన్ని వైద్య కళాశాలల్లో ప్రవేశానికి నీట్‌ను ప్రవేశపెట్టడం సమాఖ్య నిర్మాణానికి, విద్యకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని ఉల్లంఘించడమే' అని పిటిషన్ వాదించింది.

అలాగే, నీట్ వల్ల రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నివసించే, స్టేట్ బోర్డ్ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. నీట్ పరీక్ష సిబిఎస్‌ఇ/ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌పై ఆధారపడినందున ఈ విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నప్పుడు విపరీతమైన ప్రతికూలతను ఎదుర్కొంటున్నారని, నీట్ అనేది తమిళనాడు స్టేట్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సెట్ చేసిన సిలబస్‌కు భిన్నంగా ఉందని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది.

అదేవిధంగా ఆర్థిక వనరుల కొరత, కోచింగ్ తరగతులకు హాజరయ్యే అవకాశాలు లేకపోవడం, సంవత్సరం వ్యవధి తీసుకొని పరీక్షను మళ్లీ రాయలేకపోవడం వంటి అనేక ఇతర కారణాల వల్ల కూడా పైన పేర్కొన్న విద్యార్థులు ప్రతికూలంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌లో స్పష్టం చేసింది. 'అందువల్ల, ఈ విద్యార్థులు ఇంటర్ పరీక్షలలో ఎక్కువ మార్కులు సాధించినప్పటికీ, ఎక్కువ అవకాశాలు ఉన్న అర్బన్, సెమీ-అర్బన్ విద్యార్థులతో సమానంగా పోటీ పడలేరు' అని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది.

సిపిఎం మద్దతుదారుని దారుణ హత్య

- త్రిపురలో బిజెపి గూండాల ఘాతుకం

లోపలి పేజీల్లో...

కెజిబివి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- ఎంటిఎస్ అమలు చేయాలి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి బాలసుబ్రహ్మణ్యం

హిందూజాకు రూ.1235 కోట్లు

- డిస్కంలు చెల్లించాలని సర్కారు ఆదేశం
- నష్టదాయకమంటూ సిఎస్‌కు ఇఎఎస్ శర్మ లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హిందూజా పవర్ కంపెనీకి రూ.1235 కోట్లు చెల్లించాలని విద్యుత్ పంపిణీ సంస్థలకు రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. హిందూజాకు బకాయిల పేరిట చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు సమాచారం అయితే ఈ ఉత్తర్వులను రాష్ట్రప్రభుత్వం బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచింది. 2020 ఆగస్టు నుంచి 2022 ఫిబ్రవరి వరకు హిందూజా పవర్ కంపెనీ నుంచి వాడుకున్న విద్యుత్‌కు బకాయిగా ఈ డబ్బు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. యూనిట్‌కు రూ.3.82 చొప్పున చెల్లింపులు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఆదేశాలు ఇచ్చింది. దీనిపై 2022 సెప్టెంబర్‌లో హిందూజా సంస్థ రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై నియంత్రణ మండలి విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి సమాధానాలను కోరింది. ఇప్పటి వరకు పంపిణీ సంస్థలు ఇఆర్‌సికి సమాధానాలు పంపలేదు. ఈ ప్రక్రియ జరుగుతుండగానే రాష్ట్రప్రభుత్వం రూ.1235 కోట్లు చెల్లించాలని ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. ఈ డబ్బులు చెల్లించొందంటూ పలు పార్టీలు, విద్యుత్ నిపుణులు, ప్రజా సంఘాలు ఎపిఇఆర్‌సికి పలుమార్లు విన్నవించాయి. ఇటీవల జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా అదనంగా డబ్బులు చెల్లించొద్దని డిమాండ్ చేశారు. హిందూజాకు రూ.1235 కోట్లు చెల్లించాలంటూ విడుదల చేసిన ఉత్తర్వులను బహిర్గతం చేయాలని కేంద్రప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఎఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ప్రజలకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచడం సరికాదని పేర్కొన్నారు. డిస్కంలను ఆదుకోవాల్సిన కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు డిస్కంలకు, వినియోగదారులపై మరింత భారాలు వేసేవిధంగా నష్టదాయకంగా వ్యవహరిస్తోందని శర్మ విమర్శించారు. ఆర్‌టిఐ చట్టం సెక్షన్ 4 ప్రకారం అన్ని ప్రభుత్వ ఉత్తర్వులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా కాకుండా గోప్యంగా ఉంచితే తాము కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రశాంతంగా ఎస్‌ఐ రాతపరీక్షలు

- 1,53,243 మంది అభ్యర్థులు హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పోలీస్ శాఖ ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట దాకా మొదటి పేపర్, మధ్యహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్షలను నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోలీసు నియామకాల బోర్డు 291 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 1,71,936 మంది దరఖాస్తు చేసుకోగా 1,53,243 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సోమవారం ఉదయం 11 గంటల తర్వాత 'కీ'ని ఆన్‌లైన్‌లో పెడతామని నియామకాల బోర్డు చైర్మన్ మనీష్ కుమార్ సిన్హా తెలిపారు. 'కీ'పై అభ్యంతరాలను ఈ నెల 23 లోపు SCSTI-PWT@slprb.appolice.gov.inకు మెయిల్ ద్వారా తెలియజేయాలని కోరారు.

వైసిపికి మద్దతుగా ఎయు విసి సమావేశం

- ప్రయివేటు విద్యాసంస్థల నిర్వాహకులతో భేటీ • ప్రజాసంఘాల ఆందోళనతో విసి పరార్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం), బొబ్బిలి (విజయనగరం జిల్లా)

విశాఖలో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఉదయం 8.30 గంటలకు పోలీసు పహారాలో విశాఖలోని ఓ ప్రయివేటు హోటల్లో వైసిపి అభ్యర్థికి అనుకూలంగా సమావేశం ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ అనుబంధ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో ఈ సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల నుంచి సుమారు వంద కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బంది వచ్చారు. వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, వైసిపి విశాఖ జిల్లా అధ్యకులు పంచకర్ల రమేష్ బాబు, వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, పలువురు వైసిపి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కళాశాలల్లో చదువుతున్న పిజి విద్యార్థులు, సిబ్బంది ఓట్లు సుధాకర్‌కు అనుకూలంగా వేసేలా చూడాలని ఈ సమావేశం ఉద్దేశమని సమాచారం.



మీటింగ్ హాలులో ఎయు విసి ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్

సమావేశాన్ని అడ్డుకున్న ప్రజా సంఘాలు

ఈ సమావేశం విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు విశాఖ జిల్లా ఆర్‌డిఒ, డిఆర్‌ఒలకు సమాచారం అందించారు. వారు వస్తామని చెప్పడంతో హోటల్ వద్దకు సిఐటియు, విద్యార్థి, యువజన సంఘం నాయకులు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎయు విసి, రిజిస్ట్రార్ దొడ్డిదారిన జారుకున్నారు. ఎన్నికల కోడ్‌ను ధిక్కరించడం చట్టరీత్యా నేరమని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని, వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని నేతలంతా డిమాండ్ చేశారు. అనంతరం వారు అక్కడి నుంచి నేరుగా జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జునను కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళు _ండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, చంద్రశేఖర్, జి.అప్పలరాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎల్‌జె.నాయుడు, బి.గౌతమ్, సూర్యలను అరెస్టు చేసి రెండో పట్టణ పోలీసు మిగతా 2లో

'పులిచింతల' సమీపంలో భూ ప్రకంపనలు

ప్రజాశక్తి- అచ్చంపేట (పల్నాడు జిల్లా)

పులిచింతల ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో ఆదివారం ఉదయం భూమి స్వల్పంగా కంపించింది. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం, కృష్ణా జిల్లా చందర్లపాడు, నందిగామ, కంచికచర్ల, వీరుపాడు, జగ్గయ్యపేట మండలాల్లోని పలు గ్రామాల్లో స్వల్ప భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. దీంతో, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మాదిపాడు గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద నుండి కృష్ణా పరివాహక ప్రాంతమైన చల్లగిరిగ, మాదిపాడు, కంచుబోడు, జడపల్లి తండాలలో ఆదివారం ఉదయం 7.26 గంటల సమయంలో మూడు సెకండ్ల పాటు భూమి కనిపించింది. పులిచింతల ప్రాజెక్టు, నందిగామ పరిసర ప్రాంతాల్లో సమీపంలో గతంలో కూడా ఇదే మాదిరి భూమి కంపించిందంటూ మాదిపాడు గ్రామ ప్రజలు గుర్తు చేసుకున్నారు. అక్రమంగా బహుళ అంతస్తులు, తవ్వకాలు తదితర వాటి వల్ల భూమిలో ఒత్తిడులు జరిగి భూ కంపించటం జరుగుతుందని భూ గర్భ గనుల శాఖ జియాలజిస్టులు పేర్కొంటున్నారు.

దాడులు ఆపండి

- జంతర్‌మంతర్ వద్ద క్రైస్తవుల భారీ ధర్నా



దేశవ్యాప్తంగా క్రైస్తవులపై పెరుగుతున్న దాడులను నివారించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాల్లో దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంలేదని తెలిపారు. క్రైస్తవులే లక్ష్యంగా జరుగుతున్న దాడులకు సంబంధించిన కేసులను పరిష్కరించడానికి రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో జాతీయ పరిష్కార కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లు రక్తసిక్తం

- వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం
- మహాశివరాత్రి జాతర్లకు వెళ్లి వస్తుండగా ఘటనలు



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి- మేదరమెట్ల (బాపట్ల జిల్లా), హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మణం చెందారు. మహాశివరాత్రి జాతరకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదాలు జరిగాయి. మృతుల్లో అద్దంకి ఎస్‌ఐ భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.... అద్దంకి ఎస్‌ఐ సమందర్ వలీ చిన్నగంజాం మండలం సోపిరాల శివరాత్రి తిరునాళ్లలో విధుల్లో శనివారం ఉన్నారు. గుంటూరులో ఉంటున్న ఆయన భార్య వహీధా వలీ (38), కుమార్తె ఆయేషా హుమేరా వలీ (9), వీరి ఇంటి పక్కన ఉంటున్న గుర్రాల జయశ్రీ (50), గుర్రాల దివ్య తేజ (29) కలిసి కారులో సోపిరాలకు వెళ్లారు. దర్శనం అనంతరం అదే రోజు అర్ధరాత్రి గుంటూరుకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. బాపట్ల జిల్లా మేదరమెట్లలోని శ్రీ భ్రమరా వెంచర్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎదురుగా ఉన్న రోడ్డులోకి వెళ్లి గుంటూరు నుండి ఒంగోలుకు మిర్చి లోడుతో వెస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో, కారు డ్రైవర్‌తోపాటు ఐదుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ సమందర్ వలీని పరామర్శించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పరిధి దిగాసల్తాంగి గ్రామానికి చెందిన బొండం గణేష్ (19), రాప బుట్టన్న (38), సిందేరి రాంబాబు (20) కలిసి అనంతగిరి మండలంలోని బొర్రా గుహల వద్ద శనివారం రాత్రి జరిగిన మహాశివరాత్రి జాతరకు బైకుపై శనివారం వెళ్లారు. అనంతరం ఆదివారం ఉదయం తమ స్వగ్రామానికి తిరిగి వస్తుండగా లుంగాపర్తి పంచాయతీ పరిధి రాయిపాడు గ్రామ సమీప మలుపు వద్ద బైక్ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతుల కుటుంబాలను సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు పరామర్శించారు. ఈ రెండు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెజిబివి సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

- ఎంటిఎస్ అమలు చేయాలి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కస్తుర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కెజిబివి) ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. తక్షణమే వీరికి మినీమం టైం స్కేల్ (ఎంటిఎస్) విధానం అమలు చేయాలని కోరారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో

ఎపి సమగ్రశిక్షా అభియాన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర సదస్సు ఆదివారం నిర్వహించారు. జెఎసి అధ్యక్షులు ఎం బాలకాశీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కెజిబివిల ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని తాము ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. జివో 40, 5 ప్రకారం ఎంటిఎస్ అమలు చేస్తామని చెప్పి దానికి విరుద్ధంగా కేవలం 23 శాతం నామమాత్రపు వేతన పెంపుతో సరిపెట్టేసి చేతులు దులిపేసుకుందని ప్రభుత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఆర్‌సి సమయంలో ఎంటిఎస్‌పై స్వయంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. శాసనమండలిలో కూడా విద్యాశాఖ మంత్రి ఎంటిఎస్ అమలు చేస్తామని లిఖితపూర్వకమైన సమాధానం ఇచ్చారని తెలిపారు. రానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో దీనిపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి బాలసుబ్రహ్మణ్యం

ఎపి రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం సమానపనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ కార్యదర్శి మనోహర్ కుమార్, ఎస్టియు అసోసియేట్ కార్యదర్శి జెఎసి పోరాటానికి మద్దతు తెలిపారు. కెజిబివి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఎ జెఎసి ప్రధాన కార్యదర్శి కాంతారావు, ఉపాధ్యక్షులు కె విజయ్, కెజిబివి టీచర్స్, ప్రిన్సిపల్ సంఘాల నాయకులు సౌభాగ్యలక్ష్మీ, సునీత, లలిత, సుమలత, నాగరత్నం, మమత తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కెజిబివి ప్రిన్సిపాల్, టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా సౌభాగ్యలక్ష్మీ, సుమలత ఎన్నికయ్యారు. ట్రేజరర్‌గా భారతి, సభ్యులుగా మమత, అంజిబాయి, నాగరత్నం, రూపం, సౌభాగ్యవతి, సునీత, బి మహేశ్వరి, సునీత కుమారి, బ్రహ్మాణి, పుష్పలత, సంధ్య, లలిత, రుక్మిణీలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తెలంగాణ తొలి గజల్ కవయిత్రి 'ఇందిర' ఇక లేరు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ఇందిర

తెలంగాణలోనే తొలి గజల్ కవయిత్రి బైరి ఇందిర (60) కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లో ఆదివారం కన్నుమూశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన బైరి ఆమె తాను చూసిన అనుభవంలోనుంచి వచ్చిన ఉదంతాలకు అక్షర రూపమిచ్చి కథానికలుగా తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర తొలి గజల్ కవయిత్రిగా ఆమె పేరుపొందారు. 1962 డిసెంబర్ 19న బైరి రమణమ్మ, రామూ3ర్తిలకు ఇందిర జన్మించారు. ఇల్లెందులోని జెడ్‌పిహెచ్ఎస్ సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విరమణ చేశారు. ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రవృత్తిగా సాహిత్యాన్ని చివరి వరకూ సమాజహితానికి అందించారు. 1998లో 'తేనెల పలుకు' కవిత్వానికి ఆస్ట్రేలియా అంతర్జాతీయ అవార్డు లభించింది. 2016లో విజయవాడ మానస సాహిత్య ఆకాడమీ జాతీయ స్థాయి అవార్డు దక్కింది. 2009లో ఉమ్మడి రాష్ట్రంలో అంటేవుర్ రాష్ట్ర స్థాయి సాహిత్య అవార్డు, 2013లో కొత్తగూడెం 'చిగురు సాహిత్య అకాడమీ' నానో విభాగంలో అవార్డులు లభించాయి. 2016లో తొలి 'తెలంగాణ గజల్ కావ్యం' అచ్చయింది. ఇందిరకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె హిమజ కూడా గజల్ గాయని. నిజాంపేటలోని ఇందిర నివాసంలో భౌతికకాయానికి తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి, నాయకులు అనంతోజు మోహన్ కృష్ణ, సలీమ నివాళులర్పించారు. ఇందిర మరణం సాహితీ లోకానికి తీరనిలోటని వారు పేర్కొన్నారు. ఇందిర మృతికి సాహితి స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, సత్యరంజన్, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ సంతాపం తెలిపారు.



ఒకే సోఫాలో చంద్రబాబు, విజయసాయి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

రాజకీయ ప్రత్యర్థులుగా ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకునే టిడిపి అధినేత చంద్రబాబు నాయడు, వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత వి విజయసాయి రెడ్డి ఆదివారం సన్నిహితంగా కనిపించారు. సినీ నటుడు తారకరత్నకు నివాళి అర్పించేందుకు వెళ్లిన ఇరువురు నేతలు తారకరత్న నివాసంలో ఒకే సోఫాలో కూర్చున్నారు. ఇరువురు సన్నిహితంగా మాట్లాడుకుంటూ కనిపించడంతో అక్కడున్నవారిని ఆశ్చర్యపర్చింది. కాగా తారకరత్న మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంతాపం ప్రకటించారు. చలనచిత్ర రంగంలో తనదైన ప్రత్యేక ముద్ర వేశారని మోడీ ట్వీట్ చేశారు.

విసి ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు మద్దతుగా సభలు, సమావేశాలు పెట్టి బహిరంగంగా ప్రచారం చేస్తున్న ఆంధ్ర యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రసాద్‌రెడ్డి, పాఠశాల విద్య కడప ఆర్‌జెడి ప్రతాపరెడ్డిలపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి అధికార పార్టీకి తొత్తులుగా పని చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. రాజకీయపార్టీ సమావేశాలకు వైస్ చాన్సలర్ హోదాలో హాజరై అధికార పార్టీ అభ్యర్థులకు అనుగుణంగా పనిచేయడం సరైంది కాదన్నారు. ఒక గొప్ప చరిత్ర వున్న ఆంధ్ర యూనివర్శిటీకి వైస్ చాన్సలర్ హోదాలో వుంటూ దిగజారుడు పనులు చేయడం తగదని అన్నారు. కాకినాడ ఆర్‌జెడికి, ప్రకాశం జిల్లా డిఇఓలకు వర్తించే హోదా నిబంధనలు కడప ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డికి ఎందుకు వర్తించవో చెప్పాలన్నారు. విసి ప్రసాద్‌రెడ్డి అక్రమాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. తక్షణం విసిని సస్పెండ్ చేయాని డిమాండ్ చేశారు. కడప ఆర్‌జెడి పదవిలో కొనసాగించకుండా ప్రతాప్‌రెడ్డిని బదిలీ చేయాలన్నారు.

టికెట్ రద్దుతో రైల్వేకు ఆదాయం

- నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో ఆర్జన
- 2019-23 మధ్య గడించిన మొత్తం రూ. 1900 కోట్లకు పైనే
- కేంద్ర రైల్వే మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో ఇ-టికెట్ల రద్దు రైల్వేకు భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. 2019-23 మధ్య భారత రైల్వే రికార్డు స్థాయిలో రూ. 1900 కోట్లకు పైగా వసూలు చేసింది. కొన్ని నిర్ణీత మొత్తాలను సౌకర్యాల రుసుముగా కూడా పొందింది. కేంద్ర రైల్వే మంత్రి పార్లమెంటులో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇ-టికెట్లు, కంప్యూటరైజ్డ్ ప్యాసింజర్ రిజర్వేషన్ పాలసీ (పిఆర్ఎస్) కౌంటర్ల ద్వారా జారీ చేయబడిన టికెట్లు.. ఇలా రెండింటిపై రైల్వే ప్రయాణీకుల రూల్ 2015 ప్రకారం టికెట్ రద్దుపై రద్దు లేదా క్లియరెజ్ ఛార్జీ విధించబడుతుంది. దీంతో టికెట్ల రద్దు రైల్వేకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది.

పార్లమెంటులో ఒక ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖిత పూర్వక సమాధానాన్ని వెల్లడించారు. కేంద్ర మంత్రి సమాచారం ప్రకారం.. ఐఆర్‌సీటీసీ, ఈ-టికెటింగ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఆన్‌లైన్ రిజర్వ్ చేసిన ఇ-టికెట్లను బుక్ చేసుకునే ప్రయాణీకుల నుంచి భారతీయ రైల్వే క్యాటరింగ్ మరియు టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి) సౌకర్య రుసుమును విధిస్తుంది. 2019-20 నుంచి 2022-23 మధ్య (డిసెంబర్ వరకు) ఇ-టికెట్‌లతో సహా టికెట్ల రద్దు ద్వారా రైల్వేకు మొత్తం రూ. 1949.98 కోట్లు వచ్చాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కౌంటర్ మరియు ఇ-టికెట్ రెండింటినీ రద్దు చేయడం ద్వారా రైల్వే అత్యధికంగా రూ. 694.08 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రద్దుల ద్వారా రూ. 604.40 కోట్లను సముపార్జించింది. టికెట్ల రద్దుపై ప్రయాణీకులకు కన్వీనియెన్స్ ఫీజు వసూలు చేయడం లేదని కేంద్ర మంత్రి పార్లమెంటుకు తెలిపారు. కాలానుగుణంగా రైల్వేలు జారీ చేసే సూచనల ఆధారంగా ఐఆర్‌సీటీసీ ద్వారా రద్దు లేదా సౌకర్యవంతమైన ఛార్జీలు సేకరిస్తారు అని వివరించారు. ప్రస్తుతం భారత రైల్వే నిమిషానికి 25,000 టికెట్ల బుకింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. ఈ సామర్థ్యాన్ని నిమిషానికి 2.25 లక్షలకు అప్‌గ్రేడ్ చేయడం లక్ష్యమనీ, ఇందుకు సాంకేతిక మెరుగుదల చేయబడుతున్నదనీ, సాఫ్ట్‌వేర్ జోడించబడుతున్నదని రైల్వే మంత్రి ఇటీవల వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఇది 4 లక్షలకు పెంచడానికి రైల్వే శాఖ కృషి చేస్తుందన్నారు.

ఫిర్యాదు వస్తే చర్యలే

- ఆర్‌టిసి యాజమాన్యం ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రయాణీకులకు నాణ్యమైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఆర్‌టిసి యాజమాన్యం ఇటీవల పలు మార్గదర్శకాలను రూపొందించి సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. సేవా వైఫల్యాల విషయంలో రాజీ పడవద్దని, ఏ చిన్నపాటి ఫిర్యాదు అందినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆ ఉత్తర్వుల్లో నిర్దేశించడం పట్ల ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రోజు లక్షలాది మంది ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్‌టిసి దిగువ సిబ్బంది పాత్ర ఎనలేనిది. అయితే సేవా వైఫల్యాలకు సంబంధించి నేరుగా ఫిర్యాదులు అందినా..లేదా పత్రికల్లో కానీ, సామాజిక మాధ్యమాల్లో కానీ ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్లకు, జిల్లా ప్రజారవాణా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన, మర్యాదపూర్వక నడత, పరిశుభ్రత, భద్రత, ప్రయాణీకులకు సదుపాయాలు, ఆన్‌లైన్ వైఫల్యాలు, బస్‌ల విడిభాగాలు లాంటి అంశాల్లో ఎటువంటి సేవా లోపం జరగకుండా సిబ్బంది, అధికారులు అందరూ అప్రమత్తంగా వుండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సేవా వైఫల్యాలకు సంబంధించి ఎక్కడా ఫిర్యాదు వచ్చినా చర్యలు వుంటాయని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల వల్ల దిగువస్థాయి సిబ్బందిపై ఉన్నతాధికారుల వేధింపులు మరింతగా పెరుగుతాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్తర్వులను తక్షణం రద్దు చేసి హేతుబద్ధమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కోవిడ్ ముందునాటి స్థితికి విమానాల రాకపోకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణీకుల రాకపోకలు కోవిడ్ ముందునాటి స్థితికి చేరుకున్నట్లు తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి.

జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వెల్లడించిన వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి 64 దేశీయ గమ్యస్థానాలకు, 17 అంతర్జాతీయ నగరాలకు విమానాలు రాకపోకలు సాగించాయి. గత రెండేళ్ల గరిష్ట స్థాయిలో విమానాల రాకపోకలు నమోదయ్యాయి. గతేడాది జులై - సెప్టెంబరుతో పోల్చితే అక్టోబరు - డిసెంబరు త్రైమాసికంలో రద్దీ 11 శాతం పెరిగింది. గతేడాది అక్టోబరు - డిసెంబరులో ప్రయాణీకుల సంఖ్య అంతకు ముందు ఏడాది ఇదేకాలంతో పోల్చితే 25 శాతం పెరిగింది. రాకపోకలు సాగించిన మొత్తం ప్రయాణీకుల సంఖ్య 54 లక్షలకు చేరుకుంది.

టర్కీ, సిరియాలో 46 వేలు దాటిన మరణాలు

ఇస్తాంబుల్ : టర్కీ, సిరియా దేశాల్లో భూకంప మరణాల సంఖ్య 46 వేలు దాటింది. భారీ భూకంపం ధాటికి భారీ భవనాలు పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. దీంతో శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ పెద్దసంఖ్యలో మతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటివరకు టర్కీలో 40,402 మంది మరణించగా, సిరియాలో 5800 మంది చనిపోయారు. భూకంపం సంబవించి 12 రోజులు గడుస్తుండటంతో టర్కీలో సహాయక చర్యలను ముగించే అవకాశం ఉన్నది. ప్రమాదం జరిగి 296 గంటలు పూర్తవడంతో శిథిలాల కింద చిక్కుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశాలు కనిపించడం లేదని డిజాస్టర్ అండ్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అథారిటీ హెడ్ యూనస్ సెజర్ తెలిపారు. దీంతో సహాయ చర్యలను చాలావరకు ఆదివారం రాత్రి ముగించనున్నట్లు వెల్లడించారు. భూకంపం వల్ల 11 ప్రావిన్సుల్లో నష్టం కలగా.. దాంట్లో ఆదనా, కిలిస్, సనిలుర్ఫా ప్రావిన్సుల్లో ఇప్పటికే రెస్క్యూ ఆపరేషన్ ముగిసిందన్నారు. భూకంపం ధాటికి రెండు దేశ భూభాగాల్లో వేల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి.

జ్ఞాన సంపదకు ఏకైక మార్గం పుస్తక పఠనమే

- రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి
- ముగిసిన విజయవాడ పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

జ్ఞాన సంపదను పెంచుకునే ఏకైక మార్గం పుస్తక పఠనమేనని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 11 రోజులపాటు జరిగిన 33వ పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. సాయంత్రం జరిగిన ముగింపు సభలో అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తల్లి ఆప్యాయత, స్పర్శ ఎంత మధురంగా ఉంటుందో పుస్తక పఠనం కూడా అత్యంత మాధుర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రముఖ రచయితల పుస్తకాలను పుస్తక మహోత్సవంలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. మరో అతిథి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ పుస్తక పఠనానికి ఆదరణ తగ్గలేదని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇ-బుక్ వెసులుబాటు ఉన్నా, భౌతిక పుస్తకానికి ప్రాధాన్యత ఉందన్నారు. గ్రంథాలయాల అవసరాలను గుర్తించిన ప్రభుత్వం ఇ- గ్రంథాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడలో పుస్తకాల పండుగ ఎప్పుడు జరుగుతుందా అని ఎంతోమంది ఎదురు చూస్తుంటారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బి.బాబ్జి మాట్లాడుతూ 33 ఏళ్లుగా పుస్తక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విజయవాడ పాలిటెక్నిక్ కళాశాలకు బుక్ ఫెస్టివల్ సొసైటీ తరుపున పుస్తకాలను బహూకరించారు. పుస్తక మహోత్సవ్ నిర్వహణకు సహకరించిన వారికి నాగరాణి, ఢిల్లీరావు పుస్తకాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు మనోహర్‌నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

ఎయు విసిని సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార పార్టీ గెలుపుకోసం ప్రచారం చేస్తున్న ఆంధ్రా యూనివర్శివిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డిని విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు వైసిపి బలపరుస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ప్రచారాన్ని సాగించారని పేర్కొన్నారు. ఇప్పటికే కడప ఆర్‌జెడి ప్రతాప్ రెడ్డి అధికార పార్టీ నేతలా వ్యవహరిస్తూ నిబంధనలు అతిక్రమించిన నేపథ్యంలో అదే తీరులో ఆంధ్రా యూనివర్సిటీ విసి ప్రసాదరెడ్డి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం పట్ల ఎస్ఎఫ్ఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం దస్‌పల్లా హోటల్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి అధికార పార్టీకి విసి మద్దతుగా ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. గతంలోనూ క్యాంపస్‌లోనే ముఖ్యమంత్రి జగన్ జన్మదినోత్సవాలు నిర్వహించడం వంటి అనేక వివాదస్పద చర్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ఎన్నికల సంఘం తక్షణమే విసిపై చర్యలు తీసుకొవాలని, సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దస్‌పల్లాలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సమావేశం నిర్వహించడాన్ని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది.

చిన్నారి రేవతి మృతి బాధాకరం : పవన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో తాను నాలుగేళ్ల కిందట పోరాట యాత్ర చేస్తున్న సమయంలో తనను కలిసిన చిన్నారి ఎస్ రేవతి చనిపోవడం తీవ్రంగా బాధించిందని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పుట్టుకతోనే అతి భయంకరమైన మస్కులర్ డిస్ట్రోఫీ వ్యాధితో జన్మించిన రేవతి ఒక్క అడుగు కూడా నడవలేని స్థితిలో ఉండేదని, ఆ స్థితిలో కూడా చదువుకుంటూ ఆచిన్నారి చూపిన మానసిక ధైర్యం తనను అబ్బురపరిచిందని పవన్ పేర్కొన్నారు.

వైసిపికి మద్దతుగా ఎయు విసి సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సమావేశం జరుగుతున్న విషయాన్ని ఆర్‌డిఒ, డిఆర్‌ఒలకు తెలియజేసినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల అధికారి స్పందించి హోటల్‌లోని సిసి పుటేజీలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు : అజశర్మ

ఓటర్లను ప్రభావితం చేసేలా ఎయు విసి అధికార దుర్వినియోగం చేయడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ తెలిపారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విసి ప్రసాద్‌రెడ్డి గతంలోనూ పలు సందర్భాల్లో తన హోదాను మరిచి అధికార పార్టీ ఏజెంటుగా వ్యవహరించారని విమర్శించారు.

విసి, రిజిస్ట్రార్‌లను బాధ్యతల నుంచి తప్పించాలి : సిపిఎం

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ఎయు విసి, రిజిస్ట్రార్‌లను బాధ్యతల నుంచి తప్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.



విద్యార్థి సంఘాల నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

అధికార దుర్వినియోగమే : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా విశాఖలోని దసపల్లా హోటల్లో ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సమావేశం నిర్వహించడం అధికార దుర్వినియోగమేనని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ వ్యాఖ్యానించారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ అధికార దుర్వినియోగంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. గతంలో విజయనగరం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో కెజిబివి బోధన, బోధనేతర సిబ్బందితో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా సమగ్ర శిక్ష పూర్వ ఎపిసి స్వామినాయుడు సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల నమోదు నుంచి వైసిపి అక్రమాలకు పాల్పడుతోందన్నారు.

సమర్థించిన మంత్రి బొత్స

ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో ఆదివారం ఓ హోటల్‌లో ఎయు విసి ప్రసాద్‌రెడ్డి నిర్వహించిన సమావేశాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమర్థించుకొచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలోని వెల్‌కం హోటల్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. అనంతరం విలేకర్ల సమావేశంలో సుబ్బారెడ్డితో కలిసి బొత్స మాట్లాడుతూ 'విసి సమావేశాలు నిర్వహిస్తారు. అది నిరంతర ప్రక్రియ. మేం ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించం. ఎప్పుడూ చట్టబద్ధంగా నడుచుకుంటాం' అంటూ విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

తిరునాళ్లకు తరలిస్తుండగా విరిగిన ప్రభ

- పలువురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-యంత్రాంగం



మహాశివరాత్రి సందర్భంగా గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ తిరనాళ్లకు తరలిస్తున్న భారీ ప్రభ శనివారం రాత్రి విరిగి రోడ్డు మీద ఉన్న దుకాణాల సముదాయం మీద పడింది. ప్రభ పైభాగంలో బరువు ఎక్కువై కడ్డీలు విరిగిపోవడంతో ముందుకు ఒరిగి పడిపోయింది. ఈ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభకు ఉన్న జనరేటర్‌ను నిర్వాహకులు వెంటనే ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

కోటప్పకొండలో ముగిసిన ఉత్సవాలు...

పల్నాడు జిల్లా కోటప్పకొండ వద్ద మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాలకు సుమారు 20 లక్షల మందికిపైగా యాత్రికులు హాజరైనట్లు అధికారులు అంచనా వేశారు. యాత్రికులు అధిక సంఖ్యలో కొండకు పోటెత్తడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్వామి దర్శనం కోసం విఐపి దర్శనాలు ఎక్కువగా ఉండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కోటప్పకొండకు చేరిన తిరునాళ్ల ప్రభలు ఆదివారం మేళ తాళాల నడుమ వెనుతిరిగాయి. ప్రభలు వెనుదిరిగే క్రమంలో సాస్కృతిక కార్యక్రమాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలను వీక్షించేందుకు పట్టణ ప్రజలు ఉత్సాహం చూపించారు. ప్రభల వద్ద ఎటువంటి వివాదాలకు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గుజరాత్‌లో నోట్ల వర్షం

గుజరాత్ : గుజరాత్‌లో నోట్ల వర్షం కురిసింది. మెహ్‌సాణా జిల్లా కడీ తాలుకాలో ఇటీవల ఈ ఘటన జరిగింది. డాబాపై ఉన్న ఓ వ్యక్తి రూ.500 నోట్లను గాల్లోకి వెదజల్లు తుండగా.. కింద ఉన్న వారంతా వాటిని అందుకునేందుకు ఎగబడు తున్న వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒకరినొకరు తోసుకుంటూ నోట్లను అందుకునే ప్రయత్నం చేయడం వీడియోలో రికార్డైంది. మాజీ సర్పంచ్ కరీంభాయి దాదుభాయి జాదవ్ మేనల్లుడు రజక్ వివాహం సందర్భంగా ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

జీఓ1 రద్దు కోసం చలో అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

పోరాటంలో టిడిపి ప్రత్యక్షంగా పాల్గొనడంతోపాటు సదస్సు తీసుకునే ప్రతి నిర్ణయానికి అండగా నిలుస్తామన్నారు.

పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ జీఓ1 రద్దు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఐఎఎస్, ఐపిఎస్ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు.

సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళీ మాట్లాడుతూ జీఓ1వల్ల ట్రేడ్ యూనియన్లకు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టిటిడిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు 14 రోజులుగా సిఎం జగన్ గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ధర్నాలు చేపడితే ఇప్పటికి వారిపై 14కేసులు నమోదు చేశారన్నారు. టిటిడిలోని అటవీశాఖలో తమను పర్మినెంట్ చేయాలని 362మంది కార్మికులు నిరసనలు వ్యక్తం చేస్తుంటే వైసిపికి అనుకూలంగా ఉన్న 162మందిని పర్మినెంట్ చేసి మిగిలిన వారిని పర్మినెంట్ చేయలేదని తెలిపారు.

సదస్సులో జనచైతన్య వేదిక నాయకులు లక్ష్మణరెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేషు . ఆలిండియా కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య , అంగన్‌వాడీ నాయకురాలు అచంట సునీత, దుర్గాభవానీ, ఐలు నాయకులు నర్రా శ్రీనివాసరావు, అమరావతి దళిత జెఎసి నాయకులు బాలకోటయ్య, ప్రజానాట్యమండలి, విద్యార్థి సంఘాల నేతలు తదితరులు ప్రసంగించారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టానికి సవరణలు

- దళిత్ శోషణ్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టానికి విధివిధానాలతో కూడిన సవరణలు రూపొందించాలని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టానికి సవరణలు చేయాలని, పారదర్శకతతో ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధికి నిధులు ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యాన విజయవాడ మాచవరంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి జనాభా ప్రాతిపదికన 1980లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌ను రూపొందించిందని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉప ప్రణాళికే లేకుండా చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి రంగాలకు నిధులు మళ్లించి ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పడం ఆయా తరగతుల ప్రజలను మోసగించడమే అవుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధితో కూడిన అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టానికి కాలపరిమితి లేకుండా శాశ్వత చట్టం ఉండాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధి ఆత్మగౌరవంతో కూడిన ఐక్య పోరాటాలతోనే సాధ్యపడుతుందని తెలిపారు. దళితులు, గిరిజనుల సమస్యల పరిష్కారానికి, పాలక ప్రభుత్వాలపై పోరాటానికి అన్ని దళిత, గిరిజన సంఘాలతోపాటు వామపక్షాలు, సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్న పార్టీలు కృషి చేయాలన్నారు. కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బుట్టి రాయప్ప, ఎంఆర్‌పిఎస్ తెలుగు రాష్ట్రాల వ్యవస్థాపక అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు, లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చింత వెంకటేశ్వర్లు, ఎపిడికెఎస్ రాష్ట్ర కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, జి.అరుణ, ఎం.కుటుంబరావు, అమరావతి బహుజన జెఎసి నాయకులు కె.బాలకోటయ్య, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ వి.రంగారావు, రెల్లి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు 'రూట' మద్దతు

ప్రజాశక్తి-వన్‌టౌన్

తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థులకు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (రూట ఎపి) మద్దతు ప్రకటించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఉద్యమ శ్రామికులైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పొక్కిరెడ్డి బాబురెడ్డి (ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి), మీగడ వెంకటేశ్వరరెడ్డి (పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి)కు రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్ల, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమాం బాషా, సయ్యద్ ఇక్బాల్, కార్యనిర్వాహక అధ్యక్షులు ఫైరోజ్ అహ్మద్ తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఆదివారం రూట రాష్ట్ర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమాం బాషా, సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం (పాత జిల్లాలు) రాష్ట్ర, జిల్లా, రీజనల్ శాఖల బాధ్యులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. రూట సంఘ బాధ్యులందరూ పొక్కిరెడ్డి బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి గెలుపునకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అబ్దుల్ మునాఫ్, సయ్యద్ ముష్తాఖ్ హుసేన్, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లా శాఖల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లోకేష్ యాత్ర పునఃప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నందమూరి తారక రత్న మృతితో వాయిదా పడ్డ నారా లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం నుంచి తిరిగి ప్రారంభం కానుంది. శివరాత్రి రోజు విరామం అనంతరం 23వ రోజు యువగళం పాదయాత్ర ఆదివారం ప్రారంభం కావాల్సిన నేపథ్యంలో తారక రత్న మరణించడంతో వాయిదా పడింది. ఆదివారం తెల్లవారు జామున లోకేష్ తారక్ రత్న మతదేహాన్ని కడసారి చూసేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ మహా ప్రస్థానంలో తారకరత్న అంత్యక్రియలు పూర్తయిన వెంటనే సోమవారం రాత్రి శ్రీకాళహస్తికి చేరుకుంటారు. మంగళవారం యథావిధిగా యాత్ర కొనసాగుతుంది. శ్రీకాళహస్తిలోని విడిది కేంద్రం నుంచి ప్రారంభమై మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కోబాక విడిది కేంద్రంలో రాత్రి బస చేస్తారు.

తెలుగు చలన చిత్ర మండలి అధ్యక్షుడిగా దామోదర్ ప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు చలన చిత్ర మండలి అధ్యక్షుడిగా కెఎల్.దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయన జెమిని కిరణ్‌పై 23 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా వై.సుప్రియ, అశోక్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా రామ సత్యనారాయణ, సెక్రెటరీలుగా ప్రసన్న కుమార్, వైవిఎస్ చౌదరి, జాయింట్ సెక్రెటరీలుగా భారత్ చౌదరి, నట్టి కుమార్ ఎన్నుకోబడ్డారు. ఇసి సభ్యులుగా దిల్ రాజు, డివివి దానయ్య, రవి కిషోర్, రవి శంకర్, పద్మిని, వేణు గోపాల్, సురేందర్ రెడ్డి, గోపీనాథ్, మధు, కేశవ రావు, శ్రీనివాస రావు, అభిషేక్, కృష్ణ తోట, కిషోర్, రామకృష్ణ గౌడ్ ఎన్నికయ్యారు.

అనుచరులతో కన్నా భేటి

- టిడిపిలో చేరిక ప్రకటన వాయిదా!

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం గుంటూరులోని తన నివాసంలో అనుచరులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆయన అనుచరులు హాజరయ్యారు. ఈ నెల 23న టిడిపిలో చేరేందుకు సమయం ఖరారు చేసుకున్నారు. టిడిపి చేరుతున్నట్టు ప్రకటించాలని తొలుత భావించినా సినీ నటుడు తారకరత్న మృతితో ఈ ప్రకటనను వాయిదా వేశారు. టిడిపిలో చేరేందుకు ఇప్పటికే ఆయన ఆ పార్టీ నాయకత్వంతో చర్చించిన విషయాన్ని అనుచరులకు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపిలో చేరడమే శ్రేయస్కరమని ఆయన అనుచరులు సూచించినట్టు తెలిసింది. సమావేశం అనంతరం కన్నా మీడియాతో మాట్లాడుతూ.. ఏ పార్టీలో చేరేది త్వరలో వెల్లడిస్తానని ప్రస్తుతానికి నిర్ణయం వాయిదా వేసినట్టు ప్రకటించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న తారకరత్న మృతి దురదృష్టకరమన్నారు. తారకరత్న కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

గంగమ్మ జాతరలో విషాదం

- జడ్‌పిటిసి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ (కడప జిల్లా)

కడప జిల్లా పులివెందుల మండలం ఆర్.తుమ్మలపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలో షాదం చోటు చేసుకుంది. సిరి బండి కిందపడి పులివెందుల జడ్‌పిటిసి సభ్యులు మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. తుమ్మలపల్లి గ్రామ సమీపంలో చింతల గంగమ్మ ఆలయంలో శివరాత్రి సందర్భంగా గ్రామస్తులు జాతరను నిర్వహిస్తారు. జాతరలో భాగంగా సిరి బండిని కట్టి గ్రామ పొలిమేర మీద గంగమ్మ ఆలయం వద్దకు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో బండిపై ముందుభాగంలో కూర్చున్న జడ్‌పిటిసి సభ్యులు తుమ్మల మహేశ్వర్ రెడ్డి (48) ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆయనను పులివెందులలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మహేశ్వర్‌రెడ్డికి భార్య ఉమా, కుమారుడు, హేమంత్‌రెడ్డి, కుమార్తె హేమలత ఉన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న షేక్ సాబ్జీ

విద్యావ్యవస్థ నిర్వీర్యమే ప్రభుత్వ లక్ష్యం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ విమర్శించారు. 'ఉపాధ్యాయులపై దాడి- మన కర్తవ్యం, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ హామీలు, ప్రభుత్వ వైఖరి -మన కర్తవ్యం' అన్న అంశంపై పార్వతీపురంలోని లయన్స్ కల్యాణమండపంలో ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సాబ్జీ మాట్లాడుతూ ప్రాథమిక విద్యకు విఘాతం కలిగించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఉపాధ్యాయులపై వివిధ యాప్‌లు, బోధనేతర పనులతో ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందన్నారు. ముఖ్యంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లోని ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. దీని వల్ల తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వి.శ్రీనివాసరావు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోగా, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వెలంగిణి గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 117కు సంబంధించి హైకోర్టులో కేసు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 30 వేల నుంచి 40 వేల ఉపాధ్యాయ పోస్టులు అవసరం లేదని చూపించడం విచారకరమన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ఎపిలో 50,677 ఉపాధ్యాయ పోస్టులు అవసరమని కేంద్ర విద్యాశాఖా మంత్రి స్పష్టం చేశారని, వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అడ్డదారుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోడానికి ప్రభుత్వం చూస్తోందని, వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సదస్సులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిలను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పాదయాత్రలో తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్‌పై షర్మిల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై షర్మిల వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం ఉదయం మరిపెడ-మహబూబాబాద్ హైవేపై బేతోలు వద్ద బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. పరిస్థితి అదుపు తప్పేలా ఉండటంతో షర్మిల పాదయాత్రకు అనుమతిని రద్దు చేసి ఆమెను అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో షర్మిల మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. తీవ్ర పదజాలంతో తనను తిట్టారని, ఆ ఎమ్మెల్యే వేల ఎకరాల భూకబ్జాలు చేస్తున్నారనిఆమె ఆరోపించారు. ఆయన చేస్తున్న అవినీతిని ఒక మహిళ ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్నారా? అని నిలదీశారు.



ప్రజా స్వేచ్ఛకు నిర్బంధాలు శోచనీయం

- స్వేచ్ఛ జెఎసి సదస్సులో సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్
- మనువాదానికి మరణ శాసనం రాయాల్సిందే : ప్రజాకవి జయరాజు
- సదస్సు అనంతరం నేతల అరెస్ట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజల స్వేచ్ఛకు నిర్బంధాలు విధించి, కులాధిపత్యంతో కులపీడన చేసిన మనుస్మృతిని మళ్లీ తీసుకురావడం శోచనీయమని సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్ అన్నారు. అణగారిన ప్రజలను మనుస్మృతి అణిచివేసిందని, భారత రాజ్యాంగం మాత్రం వారిని అక్కున చేర్చుకుని హక్కులు కల్పించిందని తెలిపారు. స్వేచ్ఛ జెఎసి ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి' అనే అంశంపై జెఎసి కన్వీనర్ టి రమేష్ అధ్యక్షతన ఆదివారం అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో నిర్వహించిన సదస్సులో సతీష్‌చందర్ పాల్గొని మాట్లాడారు. మనుస్మృతి వేల ఏళ్లుగా ఈ దేశ ప్రజలను వర్ణం, కులం అనే గీతలు గీసి మెజారిటీ ప్రజలను అణచివేసిందని, ముఖ్యంగా మహిళలను ఒక ప్రాణం ఉన్న మనిషిగా చూడడానికి నిరాకరించిందన్నారు. భర్త చనిపోతే అతనితోపాటే పాడె ఎక్కి చావాలని నిర్దేశించడంతో పాటు వారికి చదువు, ఆస్తి వద్దని, సేవ మాత్రమే చేయాలని కుతంత్రం చేసిందని విమర్శించారు. కానీ భారత రాజ్యాంగం వారికి చదువు ఇచ్చిందని, ఆస్తి అవకాశం కల్పించిందని, ఓటు హక్కు ఇచ్చిందని, రాజ్యాన్ని పాలించాలనీ చెప్పి ఎంతో స్వేచ్ఛను కల్పించిందని తెలిపారు. అంతేకాకుండా, శూద్రులకు చదువు వద్దని, చదివితే చెవుల్లో సీసం పోసి కొట్టాలని చెప్పిందని, వారికి ఆస్తి నిరాకరించి.. ఆస్తులుంటే అడ్డంగా నరకాలని మనుస్మృతి మూర్ఖంగా వ్యవహరించిందని చెప్పారు. రక్షకులుగా ఉన్న వాళ్లను అంటరానివారిగా చేసి ఊరవతల వెలివాడల్లో పెట్టిందని, తిండిని నిరాకరించిందని, ఇళ్లు, బట్ట గుడ్డలు, మాడిమసై పోవాలని మనువాదం కుట్ర పన్నిందన్నారు. ఇలాంటి ఘోర కృత్యాలకు భిన్నంగా భారత రాజ్యాంగం ప్రతి మనిషికి విలువ ఇచ్చిందని, ఎవరూ ఏ పనైనా చేయొచ్చని తెలిపిందన్నారు. స్వేచ్ఛను గ్యారంటీ చేసిందని, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను కల్పించి జీవించడానికి అండగా నిలబడిందని తెలిపారు. కానీ రాజ్యాంగం పాటిస్తామని వాగ్దానం చేసిన పాలకులే నేడు రాజ్యాంగ హక్కుల పట్ల చిన్నచూపు చూపుతున్నారని విమర్శించారు. రచయిత జూపాక సుభద్ర మాట్లాడుతూ.. మనుస్మృతికి వ్యతిరేకంగా, భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కుల రక్షణకు పోరాటం తప్పదన్నారు. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ.. అంబేద్కర్, మార్క్స్, బుద్ధుడు చెప్పిన అంశాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికే, ప్రజల హక్కులు, స్వేచ్ఛ, రాజ్యాంగం హక్కుల రక్షణ కోసమే స్వేచ్ఛ జెఎసి ఏర్పడిందన్నారు. మనువాదానికి మరణ శాసనం రాయాలని పాటతో ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్వేచ్ఛ జెఎసి కోకన్వీనర్లు కోలా జనార్దన్, ఝాన్సీ, ఆదాం రాజు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, ఎఐఎఫ్‌డివై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, పిడిఎస్‌యు నాయకులు మహేష్, డిబిఎఫ్ నాయకులు శంకర్, నాయకులు గుత్తా జ్యోత్స్న, కృష్ణచంద్, రామకృష్ణలు పాల్గొన్నారు.

నేతల అరెస్టు

సైఫాబాద్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో స్వేచ్ఛ జెఎసి ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి' అనే అంశంపై శాంతియుతంగా సదస్సును ముగించుకుని వెళ్తున్న స్వేచ్ఛ జెఎసి, సామాజిక, ప్రజాసంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నేతలను నాంపల్లి, ముషీరాబాద్ పోలీసు స్టేషన్లకు తరలించారు. రాష్ట్రంలో శాంతియుతంగా హాల్ మీటింగ్ కూడ నిర్వహించుకోలేని పరిస్థితిలో ఉండటం దౌర్భాగ్యమని స్వేచ్ఛ జెఎసి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని తగులబెడతామంటున్న వాళ్లను పోలీసులు రక్షిస్తున్నారని, రాజ్యాంగాన్ని రక్షించాలని శాంతియుతంగా సమావేశాలు నిర్వహిస్తున్న వాళ్లను అక్రమ అరెస్టులు చేయడం శోచనీయమన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఇన్నోవా క్రిస్టా బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

టయోటా కిర్లోస్కర్ మోటార్స్ తాజాగా తమ నూతన ఇన్నోవా క్రిస్టా కోసం బుకింగ్స్ ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి కె.ఎస్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఇన్నోవా క్రిస్టా ఆధునీకరించబడిన ఫ్రంట్ ఫాసియాతో వస్తుందన్నారు. ఇది వ్యాపారవేత్తలు, కార్పొరేట్స్, ఫ్లీట్ యజమానుల అవసరాలను తీర్చనుందన్నారు. తమ డీలర్ లేదా అవుట్‌లెట్ నందు గానీ లేదా ఆన్‌లైన్‌లో రూ.50 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా నాలుగు గ్రేడ్లలో ఐదు రంగుల్లో అందుబాటులో ఉందని తెలిపారు.

మింత్రా ఫ్యాషన్ క్యాంపెయిన్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అన్ని వర్గాల ఫ్యాషన్ ప్రియులకు అన్ని రకాలైన బ్రాండెడ్ దుస్తులు అందించాలనే ఉద్దేశంతో మింత్రా సరికొత్తగా బ్రాండ్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు మింత్రా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సుందర్ బాలసుబ్రహ్మణియన్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఆనందకరమైన షాపింగ్ అనుభూతిని పొందే విధంగా షోరూమ్‌లను తీర్చిదిద్దినట్లు తెలిపారు. తాము నిర్వహించే క్యాంపెయిన్‌లో ఫ్యాషన్, సౌందర్యం, జీనవశైలి వంటి వర్గాల నుండి వారికి ఇష్టమైన అన్ని బ్రాండ్ల నుండి ఏది కావాలన్నా కొనుగోలు చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. నగరంలోని మింత్రా షోరూమ్ ద్వారా కూడా క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నామని, వినియోగదారులు ఫ్యాషన్ బ్రాండ్లను ఎంచుకోవచ్చని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో రెండు లారీలు దగ్ధం

ప్రజాశక్తి-యంత్రాంగం

వేర్వేరు ప్రమాదాల్లో రెండు లారీలు దగ్ధమయ్యాయి. కృష్ణా జిల్లాలో విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి లారీ, ప్రకాశం జిల్లాలో షార్ట్ సర్క్యూట్ కారణంగా లారీ దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు నుంచి గుడివాడవైపు వెళ్తున్న వరిగడ్డి లారీకి ఎఎంఎన్‌కె రహదారిపై ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ లారీని ఊరు బయట ఉన్న పంటబోతులోకి మళ్ళించారు. ఈ ఘటనలో లారీతోపాటు వరిగడ్డి కూడా పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలంలోని పాలేరు నది బ్రిడ్జి వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా లారీ దగ్ధమైంది. తమిళనాడు శివకాశీ నుండి అస్సాంలోని గౌహాతికి అగ్గిపెట్టెల లోడుతో లారీ వెళ్తోంది. పాలేరు బ్రిడ్జి దగ్గరకు వచ్చేసరికి ప్రమాదవశాత్తూ షార్ట్‌సర్క్యూట్ కారణంగా లారీ క్యాబిన్‌కు నిప్పంటుకుంది. వేగంగా మంటలు వ్యాపించడంతో లారీ క్యాబిన్ కాలిపోయింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అగ్గిపెట్టెల లోడుకు ప్రమాదం జరగకుండా మంటలు ఆర్పారు. ఈ ప్రమాదాల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో దగ్ధమవుతున్న లారీ

'పట్టాభి'లో కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా పెద్దాపురంలోని వాలుతిమ్మాపురం రహదారిలోని పట్టాభి ఆగ్రో ఫుడ్స్ పరిశ్రమంలో ఆదివారం తెల్లవారుజామున కార్మికుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సామర్లకోటకు చెందిన గురిశెట్టి రాజు (36) శనివారం రాత్రి 8:30 గంటలకు ఫ్యాక్టరీలో విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం సమయంలో మహిళా సూపర్‌వైజర్ బాత్రూమ్‌కి వెళ్లి తలుపు తీయగా రాజు విగత జీవిగా పడి ఉండటాన్ని గుర్తించి వెంటనే కంపెనీ యాజమాన్యానికి తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్, సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ వి.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలించారు. ఆదివారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో రాజు లేడీస్ బాత్రూమ్ వైపు వెళుతున్నట్టు కనిపించింది. ఫ్యాక్టరీ హెచ్ఆర్ మేనేజర్, సూపర్‌వైజర్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. రాజు లేడీస్ బాత్రూంలోకి ఎందుకు వెళ్లాడు, గుండెపోటుకు గురై పడిపోయి మరణించాడా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా మరింత లోతుగా విచారిస్తామని చెప్పారు. అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాజుకు భార్య సత్య, ముగ్గురు కుమారులు,ఒక కుమార్తె ఉన్నారు.

ఫ్యాక్టరీ వద్ద కుటుంబ సభ్యులు,కార్మికులు ఆందోళన

రాజు మృతిపై కుటుంబ సభ్యులు, కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. తెల్లవారు జామున మతి చెందితే మధ్యాహ్నం వరకు ఎందుకు చెప్పలేదని యాజమాన్యాన్ని నిలదీశారు. సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఈ ఫ్యాక్టరీలో కార్మిక చట్టాలు అమలు కావట్లేదన్నారు. అధికారులు వెంటనే విచారణ జరిపి రాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


నివాళులర్పిస్తున్న చంద్రబాబు

నేడు తారకరత్న అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీ నటుడు నందమూరి తారకరత్న అంత్యక్రియలు సోమవారం జూబ్లిహిల్స్ మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అభిమానుల సందర్శనార్థం తారకరత్న పార్థివదేహాన్ని ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు ఫిలిం చాంబర్‌లో ఉంచుతారు. అనంతరం అక్కడ నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర నిర్వహించి మూడు గంటల ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. శనివారం రాత్రి బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తారకరత్న తుదిశ్వాస విడవడంతో ఆయన భౌతికదేహాన్ని హైదరాబాద్ తీసుకొచ్చారు. నగర శివారులోని శంకర్‌పల్లి సమీపంలోని మోకిల గ్రామంలోని తారకరత్న బంగ్లాకు తరలించారు. ఆయనకు నివాళులర్పించేందుకు రాజకీయ, సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు దంపతులు, బాలకృష్ణ దంపతులు, నారా లోకేశ్ దంపతులు, నటులు చిరంజీవి, రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్, జూనియర్ ఎన్‌టిఆర్, కల్యాణ్ రామ్, మాజీ మంత్రులు దేవినేని ఉమ, పరిటాల సునీత, శ్రీరామ్, ఎంపి విజయసాయి రెడ్డి తదితరులు వచ్చారు. చిన్న వయస్సులోనే తారకరత్న మరణించడం బాధాకరమని చంద్రబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని తారకరత్న తనను అడిగారని గుర్తుచేశారు. తారకరత్న కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. తారకరత్న మరణం పట్ల తెలంగాణ సిఎం కెసిఆర్, మంత్రులు సంతాపం వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్షరం



"ఏ దేశంలోనైనా సంస్కృతి నిర్మాతలు ముగ్గురే! వారు :
1. శ్రమజీవులు,
2.శాస్త్రజ్ఞులు,
3. సాహిత్య కళాకారులు

– గోర్కీ



కవయిత్రి వీలునామా!

నేను పోయినప్పుడు
ఓ కాగితాన్ని కప్పండి
రాసుకోడానికి పనికొస్తుంది
మట్టిలో కప్పెట్టకండి
మరీ గాలాడదు
పురుగూ పుట్రా ఉంటాయ్!
పెన్సిలు, రబ్బరు, కర్చీఫ్
బ్యాగులో ఉండేలా చూడండి
సెల్ మర్చిపొయ్యేరు
బోర్ కొట్టి చస్తాను
దండలు గిండలు వెయ్యకండి
నాకు ఎలర్జీ!
పసుపు గట్రా పూసి
భయంకరంగా మార్చకండి
పిల్లలు ఝడుసుకుంటారు
పైగా నన్ను గుర్తుపట్టాలి కదా
పుణ్యస్త్రీ, పాపపు స్త్రీ అని
పేర్లు పెట్టకండి
నాకు చిర్రెత్తుకొస్తుంది
నా సామాన్లన్నీ పడేయకండి
అడిగినవాళ్లకు ఇచ్చేయండి
మంగళవారమైనా సరే,
పాడెకు కోడిపిల్లను కట్టి హింసించకండి
ఇప్పుడైనా నా మాట నెగ్గనియ్యండి
డ్యాన్సులాడి లేట్ చెయ్యకండి
ఏదైనా టైం ప్రకారం జరగాలి
కాస్త చూసి తగలబెట్టండి
పక్కన మొక్కలుంటాయేమో!
బడికి ఇన్ఫామ్ చెయ్యండి
వాళ్లు సెలవిచ్చుకుంటారు
దేనికీ ఇబ్బంది పడకండి
కొట్లో ఖాతా ఉంది
పిట్టకు పెట్టేదున్నా లేకున్నా
అన్ని రోజులూ అందరూ ఇక్కడే ఉండండి
మళ్లీ మళ్లీ చస్తానా ఏంటి ...
పనిలో పని
కాష్టం దగ్గర
కవిసమ్మేళనం పెట్టండి
నేనూ ఉ(వి)న్నట్టుంటుంది!

– భైరి ఇందిర
(19.2.2023 ఆదివారం మధ్యాహ్నం హైదరాబాదులో కన్నుమూసిన కవయిత్రి)

మహా రచయిత

జీవితాన్ని ధార బోశాడు
కవిత్వాన్ని శ్వాసించాడు
సాహితీ లోకాన్ని శాసించాడు
వేల గ్రంథాల్ని రచించాడు
అయితేనేం,
కాలం ఆ కష్టాన్ని కొట్టిపడేసింది
చిత్తు కాగితాలంటూ తీసి పడేసింది
ఆ రాతలకు చరిత్ర ఓ చెత్త బుట్ట.
ఓ సామాన్యుడు
ఒక్క వాక్యమే రాశాడు
మనిషి ఎదగడానికి నిచ్చెనగా
మనసులు కలవడానికి వంతెనగా
కేవలం ఒక్క వాక్యమే!
అయితేనేం,
కాలం పల్లకీ పట్టింది
కలకాలం ఊరేగిస్తానంది
ఆ వాక్యానికి చరిత్ర ఓ వెండి రథం
అందుకనే,
రాసింది ఏక వాక్యమైనా
మట్టిలా పరిమళించాలి
లేదూ,మనిషిగా వికసించాలి!

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,
94408 36931



మొసళ్ల రాజ్యం...

ఉన్న స్థానం నుండి ఇంకా
ఉన్నతికి చేరుకోవాలని
కొన్ని మండూకాల పోరాటం
వాటి కాళ్లులాగి కిందికి
దోసెయ్యాలని మరికొన్నింటి
ఎడతెగని ఆరాటం..

ఆశల అంబారీనెక్కి కలల సవారీనెక్కి
ఊరేగుతున్న వారు
ఉన్నఫళంగా బొక్క బోర్లాపడితే
పోరాట ఆరాటాల నడుమ
పోరుసల్పి సల్పి
అలిసిన అమాయక చక్రవర్తులు..

అడ్డదారినెక్కి గద్దె మీద
పడ్డ కొందరు ప్రబుద్ధులు
నా దారి రహదారి అనేవాడు
ఇంకా గమ్యం తెలీని
బాటసారియై మిగిలాడు..

ఎన్నికలతో ముడివడి
వాటితోనే మూడుముళ్లు పడ్డ
బదిలీల సంసారం కథ
ఎన్నికల నోటిఫికేషన్‌తో
కంచికి చేరింది..

ఐదేళ్లకోసారి వచ్చే జాతర కోసం
ఏర్పాటుచేసిన హంగామా
ఇక ముగిసింది
ఉపాధ్యాయ ప్రయోజనాల పర్వం
వేల యోజనాల దూరంలోనే
ఆగిపోయింది!
మొసళ్ళ రాజ్యంలో
గుంటనక్కల మంత్రాంగంలో
అన్ని కుట్రలు కుతంత్రాలే..
ఆశపడ్డ జీవితాలకు
నలుదిక్కులా నిరాశా నిస్పృహలే!

– సర్ఫరాజ్ అన్వర్
94409 81198

భాషే మన ఐడి కార్డు కానీ, అందులో ఏం నేర్పుతున్నాం?

సందర్భం



ప్రాణి మనుగడకు ముఖ్యంగా కావల్సింది గాలి, నీరు, ఆహారం. గాలి ఉంటేనే ప్రాణి బతుకుతుంది. దానికి నీరు, ఆహారం అవసరమౌతాయి. సాహిత్యానికి కూడా అలాంటివే మూడు కావాలి. భాష, రూపం, వస్తువు. భాష ఉంటే నే సాహిత్యానికి బొమ్మ ఒక రూపం ఏర్పడుతుంది. రూపం పాఠకుడి మనసులో కడితేనే వస్తువు ప్రకటింపబడుతుంది. దీన్ని బట్టి వస్తువు కన్నా, రూపానికన్నా భాష ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు. భాషే మన ఐడి కార్డు. భాషను మించిన ఐడెంటిటీ కార్డు మనకు ఇంకొకటి లేదు. సూది వెంట దారంలా భాష వెంట సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం వగైరా అన్న వాటంతట అవే సాహిత్యంలో వచ్చి చేరతాయి. అయితే ఇప్పుడు వాటిని కొంచెం ఎడిట్ చేసుకోవాల్సిన తరుణం వచ్చింది.

సాహిత్యంలో భాషను, యాసను నిలుపుకోవడమంటే మన తల్లి పాల తీయదనాన్ని మనం గుర్తు చేసుకున్నట్టు.. మన మట్టి వాసనను మనం ఎలుగెత్తి చాటుకున్నట్టు. రెప రెపమనే మన జెండాని మనం ఎగరేసుకున్నట్టు! మన చిరునామా మనం సరిగా చెప్పుకున్నట్టు. భాషే మూలం. యాసే కేంద్రకం. ఫలానా జిల్లా వాణ్ణి అని చెపితే చిరునామా పూర్తిగా చెప్పినట్లు కాదు. ఇంకా లోతుల్లోకి, మూలాల్లోకి వెళ్ళాలి. ఏ మండలమో, ఏ గ్రామమో, ఏ వీధో చెపితే గానీ మన చిరునామా పూర్తి కాదు. చిరునామాని విశ్లేషించి చూస్తే అది మన వర్గాన్ని, మన ఆర్థిక స్థోమతని కూడా తెలియజేస్తుంది. ఒక ప్రాంతం నుంచి వెలువడ్డ మంచి రచన మనకు అనేక విషయాలు తెలియజేస్తుంది, పువ్వు వెంట వచ్చే తావి లాగా. ఇక సాహిత్యం జీవిత దర్శనం అయినప్పుడు, జీవితానికి సంబంధించిన అన్ని అంశాలు, అన్ని పార్శ్వాలు అందులో చోటు చేసుకుంటాయి. ప్రధానంగా భాష! అసలు భాషే మూల వాహిక కనుక, భాష ఎంత స్పష్టంగా ఎంత సరళంగా వాడితే, ఆ రచన అంత స్పష్టంగా అంత సరళంగా అంత బలంగా తయారవుతుంది.

సాహిత్య పరిణామ క్రమంలో ఒకప్పుడు పండితులు మాత్రమే రచనలు చేసేవారు. రచనలు గ్రాంధికంలో వచ్చేవి. భూస్వామ్య వ్యవస్థ పోయి ప్రజాస్వామ్య వ్యవస్థ వచ్చినట్లుగా సాహిత్యం గ్రాంధికంలోంచి వ్యావహారికంలోకి మారింది. వ్యావహారిక భాషను పత్రికా భాష, ఉమ్మడి భాష అని ఏ పేరుతో నైనా పిలుచుకోవచ్చు. కానీ, ప్రామాణిక భాష ఏదీ అంటే, ఏ ప్రాంతానికి ఆ ప్రాంత భాషే ప్రామాణికం. సజనాత్మక రచనలు ఆయా ప్రాంతీయ భాషల్లో వచ్చినపుడే బలంగా ఉంటున్నాయన్న విషయం నిర్వివాదాంశం.

పరిపాలనా వ్యవస్థకు, శాస్త్ర సాంకేతిక విషయ వివరణకు ఉమ్మడి భాషను ఉపయోగించుకోవచ్చు . ఎందుకంటే ఆ భాష, అందులోని విషయం అన్ని ప్రాంతాల వారికి అందాల్సి ఉంది గనుక. సజనాత్మక రచనలు కూడా ఉమ్మడి భాషలో చేపట్టొచ్చు. విషయాన్ని ప్రతిభావంతంగా దర్శింపజేయొచ్చు. కవిగాని, రచయిత గాని తీసుకునే ఇతివత్తాన్ని బట్టి. రచన ఏ భాషలో ఉండాలనేది, నిజానికి ఆ రచనే నిర్దేశించుకుంటుంది. ఒక ప్రాంతానికి చెందిన భాషను, యాసను ఉపయోగించి రచన వెలువడితే అది ఇతర ప్రాంతాల వారికి అర్థం కాదు అనేది తప్పు. కొన్ని సాహిత్య విలువలతో దానిలోని స్ఫూర్తి, ఆర్తి నేరుగా అన్ని ప్రాంతాల పాఠకులకు అందుతుంది. స్వానుభవంతో చెప్పేదేమంటే తెలంగాణ ప్రజల భాషలో నేను తొలుత రాసిన కవితలు, కథలూ తెలుగు రాష్ట్రాల్లోనూ, వాటి బయటా అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యాయి. పైగా అవి ప్రజల భాషలో రాసినందుకే శక్తిమంతమయ్యాయని అందరూ ఒప్పుకున్నారు. అర్థం కాలేదని ఎవరూ అనలేదు.

ప్రత్యేకంగా ప్రజల భాషలో రచనలు రావడానికి చాలా సంవత్సరాలకు ముందే ఆ భాషా పదాలు సాహిత్యంలో జొరబడ్డాయి. మన ప్రాచీన సాహిత్య ప్రక్రియలైన పద కవిత, తత్వ కవిత, మార్గ కవిత, శతకం, ద్విపద లాంటి వాటిలో ప్రజల భాషలోని పదాలు చాలా కనబడతాయి. రచనలు ప్రజలకు అర్థం కావాలి. అందుబాటులోకి రావాలి అనే భావనలోంచే కవులు తమ రచనలో ప్రజా భాషా భాషాపదాల్ని ఎక్కువగా వాడి ఉంటారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రాచీన కాలం నుండి నేటి అత్యాధునిక యుగం వరకు ఉన్న కవులు, రచయితలలో కొంతమంది తమ రచనలు జానపద సాహిత్యానికి దగ్గరగా లేదా సమాంతరంగా ఉండాలనుకోవడం వల్ల ప్రజల భాషలోని పదాలు లిఖిత సాహిత్యంలో అంతర్భాగమయ్యాయి. అవుతున్నాయి. ఇక ముందు కూడా అవుతాయి.

ఉమ్మడి భాషలో ప్రాంతీయ పదాలు జొప్పించి ఒకరకమైన స్వతంత్ర ప్రత్యేక ప్రాంతీయ భాషకు రూపకల్పన జరుగుతూ ఉంది. ఉదాహరణకు "బతుకులోని తండ్లాటను తెలుసుకో" అనే వాక్యంలో "తండ్లాట" అనేది తెలంగాణ పల్లెల్లో విరివిగా వినిపించే మాట! మిగతా పదాలు అన్ని తెలుగు ప్రాంతాల్లో వినిపించే మాటలు. నేత పనివారి జీవితాల గూర్చి వచ్చే రచనల్లో – వారి వత్తికి సంబంధించిన పదాలు చేరతాయి. బొగ్గు గనుల్లో పనిచేసే వారి జీవితాల గూర్చి వచ్చే రచనల్లో వారికి పరిమితమైన సాంకేతిక పదజాలం సాహిత్యంలో చేరుతుంది. గోండు జీవితాల గూర్చి వచ్చిన సాహిత్యంలో గోండు భాషాపదాలు చేరుతున్నాయి. ఉదాహరణకు "పేన్కు అన్నాడు కుర్సింగ రాం". ఇందులో పేన్కు అంటే దేవుడు. పేన్కు దయి' అంటే దేవుని దయ అని అర్థం. అలాగే కుర్సింగ్ రాం గోండు జాతి వారు పెట్టుకునే పేరు.

'ఆయినా ఉత్రాయించు సార్! గాలి గుసాయించి సతాయిస్తోంది" అని ఒక కథలో ఒక పాత్ర అంటుంది. తెలుగైపోయిన ఉరుదూ పదాలతో ఒక రకమైన భాష హైదరాబాదు పాత బస్తీలో వినిపిస్తుంది. "అద్దం వేసేయండి. గాలి జొరబడి బాధిస్తోంది " అని ఆ మాటకు అర్థం. ఈ విధంగా తెలంగాణ ప్రజల భాష ఉరుదూ, ఫారసీ, అరబ్బీ, సంస్కృతం, కన్నడం, మరాఠీ లాంటి అనేక భాషల పదాలతో తయారయ్యింది. ఆధునిక కాలంలో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న కొద్ది ఇంగ్లీషు పదాలు ఎక్కువగా చేరుతున్నాయి. ఫలితంగా ఉమ్మడి భాష పెరుగుతూ ఉండడంతో పాటే ప్రాంతీయ భాష కూడా పెరుగుతూ ఉంది. గమనించ వల్సిన విషయమేమంటే, ఒక ప్రాంతీయ భాషలోనే అనేకనేక భాషా భేదాలున్నాయి. ఉంటాయి. ఎక్కడికక్కడ అవి ఉమ్మడి భాషలో కలిసి పోతుంటాయి. సమకాలీన సాహిత్య రంగంలో ఎంతోమంది ప్రతిభామూర్తులు నిజాయితీగా తమ తమ మూలాల్ని వెతికి చూపుతున్నారు. వారంతా తమ గళంలో ఒరిగిన భాషను యాసను తమ కాలంలో జొప్పించి గర్వించదగ్గ సాహిత్యాన్ని సష్టిస్తున్నారు. వారందరినీ మనస్ఫూర్తిగా అభినందించవల్సిందే!

సాహిత్యం స్పష్టంగా ఉండాలి. నిజాయితీలోంచి రావాలి. చిత్తశుద్ధిలోంచి రావాలి. నిజాల్ని వెల్లడించాలి. మరి ఇవన్నీ ఉండాలన్నప్పుడు సమాజంలోని మనుషుల్లాగానే ఆయా ప్రాంతపు సాహిత్య పాత్రలు కూడా ఆయా సమాజాల్లోంచే రావాలి. అలాంటప్పుడు పలుకుబళ్ళు, జాతీయాలు, నుడికారాలు తప్పనిసరి. అవన్నీ ఉన్నాప్పుడే సాహిత్యం సమాజపు ఆత్మలో అంతర్భామైపోతుంది. పచ్చి నిజాలు ఉన్నవి ఉన్నట్లు రాస్తే అది సాహిత్యం కాదు. వాస్తవాల మీద కాల్పనికా సజనాత్మకత ఒక సన్నని పొదలా కప్పి ఉండాలి. అప్పుడే ఆ నిజాలు సాహిత విలువలుగా మారిపోతాయి. సరే, ఈ విషయాలు ఇట్లా ఉండనిద్దాం..

భాషాసాహిత్యాల గురించి మనం ఎన్ని విషయాలైనా మాట్లాడుకోవచ్చు. భాషోద్యమాల గురించి ఎంతైనా చర్చించుకోవచ్చు. ప్రతి ఒక్కరు తల్లి పాలు తాగి పెరిగితేనే ఆరోగ్యంగా ఉంటారు. అలాగే మాతభాషలోనే విషయాలు సుళువుగా నేర్చుకోగలుగుతారు. ప్రపంచ దేశాలెన్ని తిరిగినా, ఎంతో మందిని కలిసినా, తల్లి స్థానం తల్లికే ఉంటుంది. తల్లి లాంటి పుట్టి పెరిగిన ఊరి స్థానం ఆ ఊరికే ఉంటుంది. కానీ ఇప్పుడు కొంచెం వైజ్ఞానికంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ యుగస్పహను జీవితానికి అన్వయించుకోవాలి. మనం పిల్లలకు ఏం నేర్పుతున్నాకున్నది కూడా ఇప్పుడు చాలా ముఖ్యం! పసిపిల్లలు నిలకడగా కూర్చుంటున్న దశలాగే మనవాళ్ళు 'జేజకు దండం పెట్టూ' అని చెపుతుంటారు. ఇంకొంచెం పెరగగానే 'జాబిల్లి రావే' అని పాడి వినిపిస్తుంటారు. మాటలు వస్తున్న దశలోనే 'చేత వెన్న ముద్ద చెంగల్వ పూదండ' అని దేవుడి వర్ణనలతో పాటాలు ప్రారంభమవుతాయి. వాస్తవం ఏమంటే వేల యేళ్లు గడిచినా చందమామ దిగి రాలేదు. మనిషే చంద్రుడి పైకి వెళ్ళి రావాల్సి వచ్చింది. ఊహల్లోంచి, భ్రమల్లోంచి వచ్చేది సాహిత్యమైతే, వాస్తవంలోంచి నిజంలోంచి వచ్చేది సైన్సు. 'పద పద పోదాం .. చంద్రుడి పైకి' అని పాడాల్సిన సమయం వచ్చింది కదా? దేవుడు, దయ్యం, భూతాలు, మహిమలు, మాయల కథలు మానేసి మానవుడి శౌర్య గాథలు చెప్పాల్సిన సమయం ఇది. "జానీ జానీ– యస్ పాప్పా", ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్" లాంటి ఇంగ్లీష్ రైమ్స్ పర్యావరణం గూర్చి, సామాజిక జీవనం గూర్చి, వ్యక్తిత్వవికాసం గూర్చి ఉన్నాయి. దేవుడి గూర్చి, భక్తి గూర్చి, మతం గూర్చి లేవు. ఏ దేశంలో ఏ భాషలో ఎలాంటి అబద్ధపు పాటలు ఉన్నా అని పిల్లలకు నేర్పడం మానెయ్యాలి. వారికి వాస్తవాలు చెప్పడం అవసరం. సంస్కృతి, సంప్రదాయం పేరుతో గతంలోని చెత్తనంతా వచ్చే తరాల మీద రుద్దకూడదు. వారి రెక్కల మీద మోయలేని భారం వేసి, సంశయంలో పడదోసి వారి జీవితాలు దుర్భరం చేయకూడదు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడనివ్వాలి. మానవీయ విటవల్ని దర్శింపనీయాలి. భాష మన ఐడి కార్డు నిజమే! బాల్యంలో బోధన మాత భాషలోనే జరగాలి. నిజమే! అదే న్యాయం. అయితే అది వాస్తవ దక్కోణంలోంచి వైజ్ఞానికంగా జరగాల్సి ఉంది.

– డాక్టర్ దేవరాజు మహారాజు

రాజమహేంద్రవరంలో భారత్ రంగ్ మహోత్సవ్ 2023

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (చీూణ) ప్రపంచంలోని అగ్రగామి థియేటర్ శిక్షణా సంస్థల్లో ఒకటి. దీనిని 1959లో న్యూ ఢిల్లీలో భారత ప్రభుత్వ సాంస్కతిక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ఈ సంస్థ భారతీయ నాటకరంగానికి, ప్రపంచ నాటకరంగానికి గణనీయంగా ప్రాతినిధ్యం అందించింది. నసీరుద్దీన్ షా, ఓం పురి, అనుపమ్ ఖేర్, ఇర్ఫాన్ ఖాన్, నవాజుద్దీన్ సిద్ధీ వంటి ప్రముఖ భారతీయ చలనచిత్ర నటులు ఈ సంస్థ నుంచి రూపొందినవారే!

తెలుగు నాటకరంగం దాదాపు క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం నుంచి మూలాలను కలిగి ఉంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించింది. నేటికీ రాష్ట్రంలో నాటకరంగ కార్యకలాపాలు పుష్కలంగా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వంటి సంస్థను స్థాపించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇది తెలుగు నాటకరంగానికి సహాయం చేయడమే కాకుండా రాష్ట్రంలో చాలా మంది కళాకారులకు జీవనోపాధిని కూడా సృష్టిస్తుంది.

రాజమహేంద్రవరంలో ఎన్‌ఎస్‌డి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు భారత ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా, భారత ప్రభుత్వం అందుకు ఆమోదం తెలిపింది. ఆ సన్నాహాల్లో భాగంగా ఈనెల 19 నుంచి 23 వరకు రాజమహేంద్రవరంలో ఎన్‌ఎస్‌డి 22వ భారత్ రంగ్ మహోత్సవ్ 2023 (థియేటర్ ఫెస్టివల్) నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా .. 19న సురభి వారి 'భక్త ప్రహ్లాద' నాటకం; 20న మంగుళూరు అస్థిత్వ థియేటర్ గ్రూప్ వారిచే 'కెండోనియన్స్' నాటకం; 21న అస్పోర్టివ్ థియేటర్ స్పేస్ గ్రూప్ ద్వారా, పాలక్కాడ్, కేరళ వారిచే 'లిబ్ (లెట్ ఇట్ బోదర్)' నాటకం; 22న బ్యాక్ ఆన్ స్టేజ్ థియేటర్ గ్రూప్, బెంగళూరు, కర్ణాటక వారిచే 'శ్మశాన కురుక్షేత్రం'; 23న మనలంగుడి థియేటర్ ల్యాండ్ గ్రూప్, కోవిల్‌పట్టి, తమిళనాడు వారిచే 'ఇడకిని కథయారథం' నాటకం ప్రదర్శిస్తున్నారు.

– ఆర్.మల్లికార్జున రావు,
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ
94916 59899



ప్రజాపక్ష కవి విద్యాసాగర్



సాహిత్య పిపాస గల ఉన్నతాధికారులు చాలా అరుదు. అలాంటి వారిలో ఒకరు అంగలకుర్తి విద్యాసాగర్. తనదైన భావుకతతో, బాణీతో ఉన్నత భావాలను పరిమళింపచేయడం ఆయన సాహిత్య ప్రక్రియ. సాహిత్యం ఆయన జీవితంలో అంతర్వాహిని. పని ఒత్తిడిలో అలసిపోయినప్పుడు సాహిత్యాన్ని ఒక సాంత్వనగా చేసుకొని, అలసట తీర్చుకునే తత్వం తనది. వృత్తిలో ఎదురైన వాస్తవ సంఘటనలు మిగిల్చిన అనుభవాలకు అక్షర రూపం చెక్కి, తనదైన శైలితో కథా సాహిత్యంలో సరికొత్త ఒరవడిని సృష్టించారు. అందుకు నిలువెత్తు సాక్ష్యం 'భద్రాచలం మన్నెం కథలు'. తాను ఐటిడిఎ పివోగా ఉన్న కాలంలో అక్కడి గిరిజన బతుకుల్లోని వెతల్ని, సంస్కృతిని, ప్రకృతి అందాలను పరిశీలించి, తన అనుభవాలను జోడించి ఆ కథలు రాశారు.

విద్యాసాగర్‌ది వసుధైక తాత్విక దక్పథం. అందుకే తన కవిత్వంలో ఒక చోట 'నేను పాడే పాట/ విశ్వాన్ని నాలోకి సదా ఒంపుకొంటున్న/ వో సెలయేటి పిలుపు' అంటాడు. విశ్వాంతరాలను ఆవాహన చేసుకుంటాడు. అదే సమయంలో ఊరి పొలిమేర్లు దాటి, పల్లెల్లోకి, గూడేల్లోకి వెళతాడు. గుడిసెల్లో మొండి గోడల మధ్య పగిలిన జీవితాలను, అద్దప్పెంకులను సందర్శిస్తాడు. కరెంటు లేని గూడేలు, గూట్లో దీపాలు, మొండి గోడకు పేడతో అలికి అతికించిన అద్దప్పెంకులు తన కవిత్వంలో ప్రతిఫలింప చేస్తాడు, 'దీగుడు కింద అద్దప్పెంకులో/ విశ్వమే ఓ శకలమైంది' అంటాడు. ఉన్నత వర్గాల గదుల్లో నిలువుటద్దాల్లో విశ్వం కనపడదు. మొండి గోడలకతికించిన అద్దప్పెంకులో విశ్వాన్ని ఇమడ్చటం గొప్ప వ్యక్తీకరణ. ఇది దళిత సౌందర్య శాస్త్రానికి అద్దం పడుతుంది. అమ్మకు ప్రకృతితో ఉన్న సంబంధాన్ని తన కవిత్వంలో 'అమ్మా ఆకాశాలు కవల పిల్లలే' అంటాడు విద్యాసాగర్.

విద్యాసాగర్ 'నగరానికొచ్చిన నాగళ్ళు' సంకలనంలో తన భావజాలం ఊరినుంచి మొదలై, ఓ ప్రాంతం :అస్తిత్వం దాకా సాగుతుంది. ఆర్థిక వనరుల పంపకం అనేది సామాజిక వర్గాల చైతన్య స్థాయిని బట్టి జరుగుతుంది. ఇది ప్రాంతాలకు వర్తిస్తుంది. అందుచేత ప్రాంతాలు విడిపోవడమనేది కేవలం భావన కాదు. దాని వెనకున్న ఆర్థిక అసమానతే కారణం. ఈ అసమానతలు కొన్ని సామాజిక వర్గాల అస్తిత్వాన్ని తుంచివేయడం ఎంతో కాలంగా జరుగుతుంది. ఈ నేపథ్యంలోంచే దేశం నుంచి రాష్ట్రాలు, రాష్ట్రం నుంచి ప్రాంతాలుగా విడివడిన సందర్భాలు ఉత్పన్నం అయ్యాయి. దేశ వ్యాప్తంగానూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ జరుగుతున్న పరిణామాలను చూస్తున్న వాడిగా, అధ్యయన శీలిగా, సమాజంలో జరుగుతున్న పరిణామాలకు స్పందించే కవిగా, తన అనంత అంతరాల్లో కలిగిన స్పందనలను 'నగరానికొచ్చిన నాగళ్ళు' సంకలనంగా కవిత్వీకరించాడు విద్యాసాగర్. ఈ సంకలనంలో కేవలం కవిత్వం కోసం కవిత్వం రాయలేదు. ఇప్పటి దాకా అనేక మంది అస్తిత్వాన్ని వివిధ రీతుల్లో చెప్తున్న ఆధిపత్య భావజాలానికి ప్రత్యామ్నాయ భావజాలాన్ని ప్రతిపాదించాడు ఇందులో.

విద్యాసాగర్ ప్రకాశం జిల్లాలో బాగా వెనుకబడ్డ ప్రాంతమైన కనిగిరికి యాభై కిలోమీటర్ల దూరంలో అరివేముల అనే కుగ్రామంలో 1956లో నవమణి, ఆనందం అయ్యవార్లకు జన్మించాడు. వీధి బడినుంచి ఢిల్లీ దాకా తన విద్యా ప్రస్థానం సాగింది. తల్లి కోరిక మేరకు ఐఏఎస్ అయ్యాడు. తన అధికారాన్ని ఎక్కువగా గిరిజన ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాడు. వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు. అదే సమయంలో తెలుగు సాహిత్యంలో చెరగని సంతకం విద్యాసాగర్‌ది. 'మనిషొకడే విడిగా మనలేదు', 'అసలు సంతకం', 'విశాఖా... నా విశాఖా!' మొదలైన కవితా సంకలనాల్లో తన గొంతును బలంగా వినిపించాడు. ఆయన ఎక్కడ ఉద్యోగం చేసినా కేవలం దానికే పరిమితం కాలేదు. ఒక పరిశోధకుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా ప్రతి సందర్భాన్ని అక్షర బద్ధం చేశాడు. కొన్ని సందర్భాల్లో అధికారిగా పరిమితులు ఉన్నా .. కవిగా, రచయితగా మాత్రం ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచాడు. తన రచనల్లోని అక్షరక్షరం అదే స్వరాన్ని వినిపిస్తుంది.

– కత్తి కళ్యాణ్
63038 47077

డా.రాధేయకు అమృతలత జీవన సాఫల్య పురస్కారం

ప్రముఖ కవి, విమర్శకులు, ప్రతిష్టాత్మక ఉమ్మడి శెట్టి అవార్డు వ్యవస్థాపకులైన డా.రాధేయకు నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి అమృతలత జీవన సాఫల్య పురస్కారం –2023 ప్రకటించారు. మార్చి 5వ తేదీన నిజామాబాద్‌లో ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది. గత యాభై ఏళ్లుగా కవిత్వం రాస్తూ, ముప్పై అయిదేళ్లుగా ఉత్తమ కవిత్వానికి ఉమ్మడిశెట్టి అవార్డులను ప్రదానం చేస్తున్నందుకు గానూ రాధేయని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ ప్రకటించింది.

వెంకట్ సిద్ధారెడ్డికి అక్షరం ట్రస్టు తొలి పురస్కారం

ప్రముఖ కవి, కథారచయిత కాశీభట్ల వేణుగోపాల్ అక్షరం లిటరరీ ట్రస్ట్ అనే సాహిత్య సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యరంగంలో కృషి చేస్తున్నవారికి, కవులకు, కళాకారులకు ప్రతి ఏడాది అక్షరం ట్రస్టు పురస్కారాలను ఇస్తుంది. ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ కార్యదర్శిగానూ, మరికొంతమంది కవులు సాహిత్యాభిమానులతో ఈ ట్రస్ట్ ఏర్పాటైంది. ఈ ఏడాది అక్షరం ట్రస్టు తొలి పురస్కారం కథారచయిత వెంకట్ సిద్ధారెడ్డికి ప్రకటించారు. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశం హాలులో ఈనెల 26న ఆదివారం ఉదయం పురస్కార ప్రదాన సభ జరుగుతుంది. రూ.25 వేల నగదు, మెమొంటోతో సత్కరిస్తారు.

కవితలకు ఆహ్వానం

భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నందుకు, 125 మంది కవులతో, ఒక కవితా సంపుటి తీసుకుని రావాలనుకుంటున్నాం. కవులు తమ సొంత కవితలను, మార్చి 20 సోమవారంలోగా 20 – 25 లైన్లు మించకుండా యూనికోడ్ ఫాంట్‌లో మాత్రమే పంపాలి. హామీపత్రం జతచేయాలి. మీరు పంపవలసిన మెయిల్ ఐడి : sonytangirala@gmail.com . వివరాలకు తంగిరాల సోని, 96766 09234ని సంప్రదించొచ్చు.

బాల సాహిత్యాన్ని రచయితలమే ప్రచురించుకుందాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2019 నుంచి దాదాపు రెండు సంవత్సరాలు బాల సాహిత్యం కోసం స్థానీయత ప్రధాన అంశంగా బాలసాహిత్యం రాయడం జరిగింది. చరిత్ర, ఆచార వ్యవహారాలు, చారిత్రక కట్టడాలు, పౌరాణిక స్థలాలు, గొప్ప వ్యక్తులు, ఆహార పానీయాలు, నదులు, సరస్సులు మొదలైన అంశాలలో జిల్లాల వారీగా పాఠశాల విద్యార్థుల కోసం రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో రెండు వర్క్ షాపులు నిర్వహించడం జరిగింది. ప్రతి జిల్లాలోని బాల సాహిత్య రచయితలు ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను ఎన్నో కష్టనష్టాలకోర్చి కరోనా కాలంలోనూ కథల రూపంలో రాయడం జరిగింది. అయితే పాఠశాల విద్యార్థులకు ఉపయుక్తమైన ఈ స్థానిక కథలను సమగ్ర శిక్ష ఇంతవరకు ప్రచురణకు చేపట్టలేదు. సొంత ఖర్చులతో రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి కరోనా కాలానికి కూడా భయపడకుండా రెండు వర్క్ షాప్‌లకు తమ సొంత ఖర్చులతో హాజరైన రచయితలకు ఎలాంటి చెల్లింపులు జరపలేదు. అద్భుతమైన ఈ స్థానిక కథలను జిల్లాల వారీగా మేమే ప్రచురించుకుంటాం అని వివిధ జిల్లాల నుంచి రచయితలు సిద్ధమవుతున్నారు. కాబట్టి అద్భుతమైన ఈ స్థానిక చరిత్రలను అన్ని జిల్లాల రచయిలం మనమే ప్రచురించుకొని పాఠశాల విద్యార్థులకు చరిత్ర పరిశోధకులకు అందుబాటులోకి తీసుకువద్దాం.

– మంచికంటి, కధారచయిత
రాష్ట్ర బాల సాహిత్య కోఆర్డినేటర్, 9949535695

నేడు 'రేవు తిరగబడితే ...' ఆవిష్కరణ

ఆచార్య పులికొండ సుబ్బాచారి రచించిన రేవు తిరగబడితే నవలని ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం జాకీర్ హుసేన్ హాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరిస్తారు. వీసీ ఆచార్య బిజె రావు అధ్యక్షత వహించగా ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, కొప్పర్తి వెంకట రమణమూర్తి, దార్ల వేంకటేశ్వరరావు, కోయి కోటేశ్వరరావు ప్రసంగిస్తారు. సెంటర్ ఫర్ దళిత్ ఆదివాసీ స్టడీస్, తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.

శివసేన పేరు, గుర్తు కోసం రూ.2 వేల కోట్ల ఒప్పందం


- ఎంపి సంజయ్‌రౌత్

ముంబయి: శివసేన పేరు, పార్టీ గుర్తును రూ.2 వేల కోట్లకు ఏక్‌నాథ్ షిండే గ్రూపు కొనుగోలు చేసిందని శివసేన (ఉద్ధవ్ బాలాసాహేబ్ థాక్రే) ఎంపి సంజయ్‌రౌత్ ఆరోపించారు. 'శివసేన పేరు, గుర్తు పొందడానికి రూ.2000 కోట్ల ఒప్పందం జరిగినట్లు నా వద్ద విశ్వసనీయమైన సమాచారం ఉంది. రూ.2,000 కోట్లు అనేది ప్రాథమిక సంఖ్య. ఇది 100 శాతం నిజం. అనేక విషయాలు త్వరలో వెల్లడి చేయబడతాయి. దేశ చరిత్రలో ఎప్పుడూ ఈ విధంగా జరగలేదు' అని రౌత్ ఆదివారం ట్వీట్ చేశారు. దీనిపై ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి సన్నిహితంగా ఉండే ఒక బిల్డర్ ఈ సమాచారాన్ని తనతో పంచుకున్నారని తెలిపారు. తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని, వాటిని త్వరలో బయటపెడతానని చెప్పారు. 'ఎన్నికల కమిషన్ నిర్ణయం ఒక ఒప్పందం' అని ఆయన ఆరోపించారు.

బడ్జెట్ కసరత్తులో ఉన్నా... విచారణ వాయిదా వేయండి

- సిబిఐకి మనీష్ సిసోడియా లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కసరత్తులో ఉన్నానని, తన విచారణ వాయిదా వేయాలని సిబిఐకి ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా లేఖ రాశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆదివారం తమ ముందు హాజరు కావాలని మనీష్ సిసోడియాకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) శనివారం సమన్లు జారీ చేసింది. తన విచారణను ఫిబ్రవరి చివరి వారం వరకు వాయిదా వేయాలని సిసోడియా ఆదివారం సిబిఐని కోరారు. 'బడ్జెట్‌ను సకాలంలో సమర్పించడం ఆర్థిక మంత్రిగా నా కర్తవ్యం. ఇది చాలా కీలకమైన ప్రక్రియ. దీని కోసం 24 గంటలు పని చేస్తున్నా. బడ్జెట్‌ను ఖరారు చేస్తున్న నేపథ్యంలో.. సమయం కావాలని సిబిఐకి లేఖ రాశా. ఫిబ్రవరి చివరి వారం తరువాత విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరా' అని సిసోడియా మీడియాకు తెలిపారు.

సిపిఎం మద్దతుదారుడి దారుణ హత్య

త్రిపురలో బిజెపి గూండాల ఘాతుకం

అగర్తల : త్రిపుర ఎన్నికల్లో ఓటమి సంకేతలు కనిపిస్తుండటంతో, బిజెపి గూండాలు హింసాకాండకు పాల్పడుతున్నారు. ఇప్పటికే పలు కార్యాలయాలు, ఇళ్లపై దాడులకు పాల్పడి, పలువురిని తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. తాజాగా, కళ్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిపిఎం మద్దతుదారుడిని హత్య చేశారు. ద్వారికపూర్ పంచాయతీ బిజెపి 'ప్రధాన్'గా వ్యవహరించే కృష్ణ కమల్‌దాస్, అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా దాడి చేసి కొట్టడంతో సిపిఎం మద్దతుదారు దిలీప్ శుక్లా దాస్ మరణించాడు. కృష్ణ కమల్‌దాస్, దిలీప్ శుక్లా దాస్ కుటుంబాలు ద్వారికపూర్‌లో పక్కపక్కనే నివసిస్తుంటాయి. శనివారం సాయంత్రం ఇరు కుటుంబాల మధ్య చిన్నపాటి వాదన జరిగింది. వాదనలో రెచ్చిపోయిన కృష్ణ కమల్‌దాస్, అతని కుటుంబ సభ్యులు దిలీప్ శుక్లా దాస్‌ను తీవ్రంగా కొట్టారు. దిలీప్ శుక్లాను అగ్నిమాపక సిబ్బంది రక్షించి కోవాయిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. దిలీప్‌కు తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆ ఆసుపత్రి వారు ఆదివారం ఉదయం జిబిపి ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మరణించాడు. దిలీప్ మృతితో కళ్యాణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో విషాదచాయలు నెలకున్నాయి. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కృష్ణ కమల్‌దాస్‌ను అదుపులోకి తీసుకుని ఆదివారం కోవాయి కోర్టులో ప్రవేశపెట్టారు.

దిలీప్ శుక్లాదాస్ మృతదేహాన్ని అప్పగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కుంజాబన్ ప్రాంతంలో హెరిటేజ్ పార్కు వద్ద సిపిఎం నాయకులు, కార్యకర్తలు సుమారు ఎనిమిది గంటలపాటు ఆందోళన చేశారు. సిపిఎం కార్యాలయానికి తరలించడానికి అడ్డుకోవడంతో, సర్క్యూట్ హౌస్‌లోని గాంధీ విగ్రహం వద్దకు తరలించారు. మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తదితరులు నివాళులర్పించారు.



సిపిఎం మద్దతుదారు దిలీప్ శుక్లా దాస్ భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న మాణిక్ సర్కార్ (ఇన్‌సెట్‌లో దాస్ ఫైల్‌ఫొటో)

అస్సాంలో అక్రమ మైనింగ్ వెనక బిజెపి

ఎజెపి విమర్శ

గౌహతి : అస్సాంలో అక్రమ బొగ్గు మైనింగ్ వెనక కొంత మంది బిజెపి నాయకులు ఉన్నారని అస్సాం జతియ పరిషద్ (ఎజెపి) విమర్శించింది. ఈ విషయంపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి, ఎన్‌జిటి, జాతీయ మానవ హక్కుల కమిషన్, రాజ్యసభలో ప్రతిపక్ష నేతలకు వినతిపత్రాలను పంపింది. ఈ సందర్భంగా ఎజెపి అధ్యక్షులు లురింజ్యోతి గొగొయి, ప్రధాన కార్యదర్శి జగదీష్ భుయాన్ విలేకరులతో మాట్లాడారు. అస్సాంతో పాటు మేఘాలయ, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి నాయకుల అండదండలతో అక్రమమైనింగ్ జరుగుతుందని చెప్పారు. అక్రమ మైనింగ్‌ను 2014లో ఎన్‌జిటి నిషేధం విధించినా కొనసాగుతుందని తెలిపారు. అస్సాంలో నెలకు రూ.2 వేల కోట్ల విలువైన అక్రమ మైనింగ్ తవ్వకం, రవాణా జరుగుతుందని ఎజెపి తన వినతిపత్రంలో పేర్కొంది. అక్రమ మైనింగ్ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన గౌహతి హైకోర్టు రిటైర్ట్ జడ్జి నేతృత్వంలోని విచారణ బృందం తన నివేదికలో ధ్రువీకరించిందని ఎజెపి గుర్తు చేసింది.

తమిళ హాస్య నటుడు మయిల్‌స్వామి మృతి



చెన్నై : ప్రముఖ కోలీవుడ్ హాస్యనటుడు మయిల్‌స్వామి (57) మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున మయిల్ స్వామి అనారోగ్యం పాలవ్వడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని పోరూర్ రామచంద్ర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన మరణం పట్ల పలువురు కోలీవుడ్ సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. మిమిక్రీ ఆర్టిస్టుగా పని చేస్తున్న మయిల్ స్వామి 1984లో నటుడిగా కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 2000 నుంచి కమెడియన్‌గా అతనికి మంచి గుర్తింపు వచ్చింది. చాలా సినిమాల్లో తనదైన కామెడీతో ప్రేక్షకులను నవ్వించాడు. ఆయన తమిళంలో నటించిన పలు చిత్రాలు తెలుగులోనూ అనువాదమై విజయవంతమయ్యాయి.

భారత్‌లో ఏడాదికి 15వేల అవయవ మార్పిడులు..



న్యూఢిల్లీ : మనదేశంలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు పెరుగు తున్నాయి. తాజాగా ఈ సంఖ్య ఏడాదికి 15వేలకు చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 'కోవిడ్ తర్వాత అవయవ మార్పిడి కేసుల్లో ఎంతో వేగం పెరిగింది. గతేడాది 15వేల మార్పిడిలు జరిగాయి. ఈ స్థాయిలో జరగడం ఇదే తొలిసారి. ఇంతకుముందుతో పోలిస్తే అవయవ మార్పిడి కేసుల సంఖ్యలో 27శాతం పెరుగుదల కనిపించింది' అని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన నోటో సైంటిఫిక్ డైలాగ్-2023 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. వీటికోసం కేంద్ర, రాష్ట్ర, ప్రాంతీయ స్థాయిలోనూ ప్రత్యేక విభాగాలు ఉన్నాయని చెప్పారు. భారత్‌లో వద్ధుల జనాభా క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి నాణ్యమైన జీవన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ పేర్కొన్నారు. ఇప్పటికే 640 మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు ఉన్నప్పటికీ.. అవయవ మార్పిడి సర్జరీ చేసే సదుపాయం కొన్నింటిలోనే ఉందని, వీటిని మరింత పెంచాలని అన్నారు.


అరుణాచల్, ఇండోర్‌లో భూకంపాలు

ఇటానగర్: అరుణాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో ఆదివారం స్వల్ప భూకంపాలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు చోట్ల ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టాలు నమోదు కాలేదు. అరుణాచల్ ప్రదేశ్‌లో రిక్టర్ స్కేల్ పై 3.8 తీవ్రతతో ఆదివారం భూకంపం వచ్చింది. అస్సాం, భూటాన్ దేశం తూర్పు ప్రాంతాల వరకు ప్రకంపనలు వచ్చాయి. అరుణాచల్ ప్రదేశ్ పశ్చిమ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 12.12 గంటలకు 3.8 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూటాన్ సరిహద్దుల్లోని పశ్చిమ కమెంగ్ లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉంది.

పూజలు చేస్తున్న దళిత మహిళలపై దాడి

భోపాల్ : శివరాత్రి సందర్భంగా శివాలయంలో పూజలు చేస్తున్న దళిత మహిళలపై కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన మధ్య ప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో చోటు చేసుకుంది. శనివారం శివరాత్రి సందర్భంగా ఛప్రా గ్రామంలో బలై సామాజిక వర్గానికి చెందిన కొందరు (వీరు దళితుల్లోకి వస్తారు) మహిళలు శివాలయంలో పూజలు నిర్వహించారు. వీరితో మరాఠా, గుర్జార్ సామాజిక వర్గానికి చెందిన కొంత మంది వాదనకు దిగారు. తరువాత మహిళలని కూడా చూడకుండా దాడికి దిగారు. రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఆలయం నుంచి వెళ్లగొట్టారు. ఈ సంఘటనపై గాయపడిన ఇరు పక్షాల వారి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఆలయంలోకి ప్రవేశించకుండా ఎవరినీ అడ్డుకోకూడదని చెప్పినా అడ్డుకున్నారని తెలిపారు.

బిజెపికి వంద సీట్లలోపే : నితీష్‌కుమార్



పాట్నా: ప్రతిపక్ష పార్టీలన్నీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు ఏకమవ్వాలని బీహార్ సిఎం, జెడియు నేత నితీష్‌కుమార్ సూచించారు. ఈ 'యునైటెడ్ ఫ్రంట్'తో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సీట్లను 100 కంటే తగ్గించవచ్చునని పేర్కొన్నారు. పాట్నాలో పలు ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరైన ఓ కార్యక్రమంలో నితీష్ మాట్లాడుతూ.. ఐక్య కూటమిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తనకు ప్రధాని అవ్వాలనే ఆశ లేదని మరోసారి ఆయన స్పష్టం చేశారు.

అదానీపై మాట్లాడితే.. కేసులు.. విచారణ



- జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులు, సాధారణ పౌరులపైనా కేసులు
- వందల కోట్లతో పరువునష్టం ఆరోపణలు, క్రిమినల్ కేసులు
- వేర్వేరు రాష్ట్రాల్లో కేసుల విచారణ.. తట్టుకోలేకపోతున్న బాధితులు

అదానీ కంపెనీ అక్రమాలు, స్టాక్ మార్కెట్ మోసాలపై 'హిండెన్‌బర్గ్' నివేదిక ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రపంచ మీడియా స్వేచ్ఛగా ఈ నివేదికపై వార్తా కథనాలు రాసింది. భారత్‌లో ప్రధాన మీడియా, వందలాది టివి ఛానల్స్ భయపడుతున్నాయి. ఈ వ్యవహారంతో ప్రధాని మోడీ పేరు ముడిపడి ఉన్నందున మీడియా, టివి ఛానల్స్ 'హిండెన్‌బర్గ్' నివేదికపై విశ్లేషణ చేయడానికి వెనుకాడు తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం..'అదానీ గ్రూప్' వేసే పరువునష్టం కేసులు. మరోవైపు మోడీ సర్కార్ నుంచి ఎదురయ్యే వేధింపులు. అదానీపై వార్తలు రాసిన.. వ్యాఖ్యలుచేసిన స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్స్, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, మరికొంత మందిపై వందలకోట్ల పరువునష్టం కేసులు, క్రిమినల్ కేసులున్నాయి.

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలో పర్యావరణ కార్యకర్త బెన్ పెన్నింగ్, సిఎన్‌బిసి, టివి 18 జర్నలిస్టులపై అదానీ కంపెనీలు క్రిమినల్ పరువునష్టం కేసులు వేశాయి. 'హిండెన్‌బర్గ్' నివేదిక బయటకు వచ్చాక పెద్ద పెద్ద మీడియా సంస్థలు మాట్లాడటానికి, వార్తలు రాయడానికి జంకుతున్నాయి. దీనికి కారణం అదానీ గ్రూప్‌నకు మోడీ సర్కార్ నుంచి అందుతున్న మద్దతు, సహకారం. గౌతం అదానీ కంపెనీ ఆర్థిక అక్రమాలు, ఆ కంపెనీలకు దక్కుతున్న రుణాలపై ఇన్వెస్టర్స్, జర్నలిస్టులు, సాధారణ పౌరులు, ఎంతో మంది రాజకీయ నాయకులు ఆరోపణలు చేశారు. ఇప్పుడు 'హిండెన్‌బర్గ్' నివేదికతో వారి ఆరోపణలకు మరింత బలం చేకూరింది. పరువునష్టం కేసులు, కోర్టు కేసులు వేస్తూ అదానీ గ్రూప్ కంపెనీ ఇంతకాలం బెదిరిస్తూ వస్తోంది. 'అదానీ గ్రూప్' గురించి మాట్లాడితే ప్రతీకారం తప్పదనే పరిస్థితి సృష్టించింది. హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చాక అదానీ గ్రూప్ మనుషులు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగారు.

మూడు రాష్ట్రాల్లో ఆరు కేసులు

67 ఏళ్ల పరంజయ్ గుహా థాకుర్తా ఇండిపెండెంట్ జర్నలిస్టు. ఆయనపై అదానీ గ్రూప్ ఆరు పరువునష్టం కేసులు వేసింది. ఇందులో మూడు క్రిమినల్ కేసులున్నాయి. గౌతం అదానీ కంపెనీ అక్రమాలపై వరుస వార్తా కథనాలు రాసినందుకు ఆయనకు దక్కిన ఫలితమిది. ఒక ఉన్నత స్థాయి కోర్టు న్యాయమూర్తి అదానీ గ్రూప్‌నకు అనుకూలంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ థాకుర్తా వార్తా కథనం రాశారు. దీనిపైనా ఆయన కోర్టు కేసు ఎదుర్కొంటున్నారు. ఇకపై ఆయన అదానీ పేరెత్తడానికి వీల్లేదు, అదానీపై వార్తలు రాయరాదు.. అంటూ ఆ కేసులో న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుల విచారణను ఎదుర్కోవటానికి ఆయన అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

"గౌతం అదానీ కంపెనీ వ్యవహారాలపై మాట్లాడరాదు.. అంటూ కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల్ని ధిక్కరించలేం. అదానీ కంపెనీలు వేసిన కేసులను ఎదుర్కొనేందుకు పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు అవుతున్నాయి. మూడు రాష్ట్రాల్లో కేసుల విచారణకు హాజరవుతున్నాం. మానసికంగా, శారీరకంగా మమ్మల్ని వేధించటమే ఇది" అని థాకుర్తా సహ ఉద్యోగి అబీర్ దాస్‌గుప్తా చెప్పుకొచ్చారు. "మా సమయాన్ని, కుటుంబాల్ని ప్రభావితం చేస్తున్నారు. ఎంతో సమయాన్ని కోల్పోవటమేగాక, ఆదాయాన్ని సైతం వదులుకోవాల్సి వస్తోంది" అని చెప్పారు.

అత్యధిక ఛానల్స్ అనుకూలమే!

హిండెన్‌బర్గ్ నివేదికలో పేర్కొన్న అంశాలు..'భారత ఆర్థిక వ్యవస్థ'పై జరిగిన తీవ్రవాద దాడిగా మోడీ అనుకూల మీడియా చెబుతోంది. హిండెన్‌బర్గ్ నివేదికపై భారతీయ మీడియా చర్చించడానికి ఇష్టపడటం లేదని, 400 టివి ఛానల్స్‌లో అత్యధికం అనుకూలంగా ఉండటం మోడీ సర్కార్‌కు కలిసివచ్చిందని న్యూస్‌లాండ్రీ జర్నలిస్ట్ 'మనీషా పాండే' అన్నారు. "ఒక బడా కార్పొరేట్ కంపెనీపై వచ్చిన నివేదికగానే కాదు, ఇది భారత ప్రధాని మోడీ, ఆయన పాలనపై వచ్చిన ఆరోపణలుగా చూడాలి" అని చెప్పారు.

హిండెన్‌బర్గ్ ఏం చెప్పింది?

హిండెన్‌బర్గ్ నివేదికలో పేర్కొన్న ముఖ్యమైన ఆరోపణ..భారత స్టాక్‌మార్కెట్‌ను కృత్రిమంగా ప్రభావితం చేయటం. మలేషియాలోని ఒక కంపెనీ అదానీ షేర్లను కొనుగోలు (ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా) చేసింది. దీంతో అదానీ షేర్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి. షేర్లు కొనుగోలు చేసిన ఆ కంపెనీ అదానీదే. కేంద్రం ఒత్తిడితో ఎల్ఐసి, ఎస్‌బిఐ వేల కోట్ల రుణాలు ఇచ్చాయి. అదానీ కంపెనీల అక్రమాల్లో మచ్చుకు ఇదొక ఉదాహరణ మాత్రమే. ప్రధాని మోడీకి గౌతం అదానీ అత్యంత సన్నిహితుడు అన్నది అందరికీ తెలిసిందే. కేంద్ర ప్రభుత్వంతో ఆయనకు ఉన్న సంబంధాలు, సహకారంతో రుణాలు అందాయని అర్థమవుతోంది. దీంతో ఓడరేవులు, విమానాశ్రయాలు, బొగ్గు క్షేత్రాలు, వంట నూనెల తయారీ.. ఇలా అనేక రంగాల్లో 'అదానీ గ్రూప్' గుత్తాధిపత్యం పతాక స్థాయికి చేరింది.

ఎయిర్‌బెలూన్ ఘటనపై వైఖరి మార్చుకోండి

అమెరికాను కోరిన చైనా



బీజింగ్ : ఎయిర్‌బెలూన్ సంఘటనపై వైఖరి మార్చుకోవాలని అమెరికాను చైనా కోరింది. అమెరికా విదేశాంగ మంత్రి అంటోని బ్లింకెన్‌తో జరిగిన అనధికార సమావేశంలో చైనా దౌత్య వేత్త వాంగ్ యీ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మునిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ (ఎంఎస్‌సి) నేపథ్యంలో అమెరికా అభ్యర్థన మేరకు ఈ సమావేశం జరిగింది. ఎయిర్‌బెలూన్ సంఘటనపై చైనా వైఖరి స్పష్టంగా ఉందని, ఈ సంఘటన వల్ల ఏర్పడిన ద్వైపాక్షిక నష్టాన్ని అమెరికానే పరిష్కరించాలని వాంగ్ యీ ఈ సమావేశంలో స్పష్టం చేశారు. శనివారం జరిగిన ఈ సమావేశం వివరాలను చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. ఎయిర్‌బెలూన్‌పై అమెరికా ప్రతిచర్యను 'ఉన్మాదం'గానూ, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించడం గానూ వాంగ్ యీ ఇప్పటికే విమర్శించారు. చైనా ఎయిర్ బెలూన్‌ను అమెరికా కూల్చివేసిన సంఘటన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు నష్టం కలిగించిందని, ఇప్పటికే ఇరు దేశాల మధ్య క్షీణిస్తూ ఉన్న సంబంధాల నేపథ్యంలో అలాంటి చర్య సరైనది కాదని కొంతమంది విశ్లేషకులు కూడా పేర్కొన్నారు.



సిరియాపై ఇజ్రాయిల్ దాడులు

ఐదుగురి మృతి

డమాస్కస్ : సిరియాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఐదుగురు మృతి చెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడుల్లో అనేక నివాస గృహాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున ఈ దాడులు జరిగాయని సిరియా అరబ్ న్యూస్ ఏజెన్సీ (ఎస్ఎఎన్ఎ) వెల్లడించింది. సిరియా రాజధాని డమాస్కస్ లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, మృతుల్లో ఒక సైనికుడు కూడా ఉన్నట్లు తెలిపింది. సుమారు ఒక దశాబ్దం నుంచి సిరియాపై ఇజ్రాయిల్ తరుచూ వైమానిక దాడులకు పాల్పడుతోంది. గత నెలలో డమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయంపై చేసిన క్షిపణి దాడిలో ఇద్దరు సైనికులతో సహా నలుగురు మరణించారు.

ఐఎస్ ఉగ్రదాడిలో 53మంది మృతి

సిరియాలోని సెంట్రల్ ఎడారి ప్రావిన్స్ హోమ్స్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు శనివారం జరిపిన దాడిలో కనీసం 53 మంది మరణించారు. వారిలో 46 మంది స్థానికులు, ఏడుగురు సైనికులు ఉన్నారు. ఈ ఏడాది సిరియాలో జరిగిన అతిపెద్ద ఉగ్రదాడి ఇదేనని పామిరా నేషనల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ వాలిద్ ఓడ్ చెప్పారు. ఇదిలావుండగా, దాడులతో సంబంధం ఉన్న ఐఎస్ ఉన్నతాధికారి ఒకరిని పట్టుకున్నట్లు అమెరికా మిలట్రీ ప్రకటించింది. హోమ్స్ ప్రావిన్స్ సిరియా ప్రభుత్వం, దాని మిత్రదేశాల నియంత్రణలో ఉంది. ఇక్కడ కొన్ని ప్రాంతాలు గతంలో ఐఎస్ ఆధీనంలో ఉండేవి. అమెరికా, కుర్దిష్ బలగాలు శుక్రవారం జరిపిన వైమానిక దాడిలో ఈశాన్య సిరియాలో ఐఎస్ నాయకుడు హమ్జా అల్-హోమ్సీ హతమయ్యాడు.

కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఐక్యత అసాధ్యం

- 2024లో బిజెపి ఓటమే లక్ష్యం
- ఛత్తీస్‌గఢ్‌లో 24 నుంచి 26 వరకు 85వ ప్లీనరీ
- మీడియాతో కాంగ్రెస్ నేతలు



కెసి వేణుగోపాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఐక్యత సాధ్యం కాదని ఆ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశం ఈ నెల 24 నుండి 26 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నాడిక్కడ ఎఐసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ స్టీరింగ్ కమిటీ సెషన్ మొదటి రోజు సమావేశమై, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)కి ఎన్నికలు నిర్వహించాలా? వద్దా? అని నిర్ణయిస్తుందని అన్నారు. ప్లీనరీ సమావేశాల అజెండాను తొలిరోజు జరిగే స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఖరారు చేస్తామని, ఆ తరువాత సబ్జెక్టుల కమిటీ తీర్మానాలకు తుది రూపం ఇస్తుందని వేణుగోపాల్ తెలిపారు. 2005లో హైదరాబాద్‌లో ప్లీనరీ తరువాత, ఢిల్లీ వెలుపల కాంగ్రెస్ ప్లీనరీ జరగడం ఇదే ప్రథమమని అన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 15,000 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యమని, అందుకోసం వివిధ ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్లీనరీ భారత్ జోడో యాత్రలోని మనోభావాలకు అద్దం పడుతుందని, ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌కు పొడిగింపు అని చెప్పారు.

ప్రతిపక్షాల ఐక్యత ప్రాధాన్యతను గుర్తించాం : జైరాం రమేష్

ప్రతిపక్షాల ఐక్యత ముఖ్యమని కాంగ్రెస్ గుర్తిస్తోందని, ప్లీనరీ సమావేశంలో ఈ అంశంపై చర్చిస్తామని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ అన్నారు. ప్రతిపక్షాల ఐక్యతపై నితీష్ కుమార్ ప్రకటనను స్వాగతిస్తున్నామని, ప్లీనరీలో చర్చిస్తామని చెప్పారు. 2024 ఎన్నికల కోసం ఏమి చేయాలో చర్చిస్తామని తెలిపారు. అంతకుముందు అనేక అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని, బలమైన కాంగ్రెస్ లేకుండా, బలమైన ప్రతిపక్ష ఐక్యత అసాధ్యమని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఐక్యంగా బిజెపిని ఎదుర్కోవాలని పేర్కొన్నారు. అదానీ సంస్థ అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదికకు సంబంధించి జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణను కోరుతున్నామని, స్కామ్‌పై దర్యాప్తునకు ఆదేశించే వరకు ఈ అంశాన్ని లేవనెత్తుతామని రమేష్ అన్నారు. రాయపూర్‌లో 26న భారీ బహిరంగ సభతో ప్లీనరీ ముగుస్తుందని పార్టీ కోశాధికారి పవన్ కుమార్ బన్సాల్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు కుమారి సెల్జా, తారిక్ అన్వర్ మీడియాతో మాట్లాడారు.

అమెరికా, దక్షిణ కొరియాలకు ఐసిబిఎం ప్రయోగం ఓ హెచ్చరిక

ఉత్తర కొరియా

ప్యోంగ్యాంగ్ : అమెరికా, దక్షిణ కొరియాలకు హెచ్చరికగానే హ్వాసాంగ్-15 ఖండాంతర బాలిస్టిక్ మిస్సైల్ (ఐసిబిఎం)ను ప్రయోగించినట్లు ఉత్తర కొరియా ఆదివారం ప్రకటించింది. శనివారం ఈ ఐసిబిఎం ఆకస్మిక ప్రయోగాన్ని ఉత్తర కొరియా నిర్వహించిన సంగతి తెలిసిందే. శత్రు శక్తులపై 'శక్తివంతమైన ఎదురుదాడి'కి సంసిద్ధతగానే ఈ ప్రయోగం చేపట్టినట్లు చెప్పింది. శనివారం మధ్యాహ్నం జపాన్ పశ్చిమ తీరంలో ఈ ప్రయోగం జరిగింది. 'ఈ ఆకస్మిక, ఆశ్చర్యకరమైన ఐసిబిఎం ప్రయోగం శత్రు శక్తులపై అణు ప్రతిఘటన సామర్థ్యాన్ని మరింత శక్తివంతంగా మార్చడానికి ఉత్తర కొరియా సిద్ధమైన ప్రయత్నాలకు ఒక నిజమైన రుజువు' అని ఉత్తర కొరియా అధికారిక వార్త సంస్థ కెసిఎన్ఎ తెలిపింది. ఈ క్షిపణి 4,015 సెకన్ల పాటు 989 కిలోమీటర్లు (614 మైళ్లు) ప్రయాణించిందని, గరిష్టంగా 5,768 కిలో మీటర్లు (3,584 మైళ్లు) ఎత్తు వరకు వెళ్లిందని, దీని తరువాత ముందుగా నిర్దేశించిన లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించిందని కెసిఎన్ఎ తెలిపింది.

ఈ ప్రయోగం గురించి ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్ సోదరి యో జోంగ్ స్పందించారు. 'మేం శత్రువుల ప్రతి కదలికనూ గమనిస్తామని హెచ్చరిస్తున్నాను. మాకు ప్రతికూలంగా ఉన్న ప్రతి కదలికకు వ్యతిరేకంగా శక్తివంతమైన, తీవ్రమైన


బ్లూటిక్ బాదుడు

- త్వరలో ఫేస్‌బుక్‌లోనూ ఛార్జీలు
- ఎలాన్ మస్క్ బాటలోనే జుకర్‌బర్గ్

న్యూయార్క్: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో బ్లూ బ్యాడ్జ్‌ను అందించేందుకు ప్రీమియం వెరిఫికేషన్ పద్ధతి అమలు చేయాలని వాటి మాతృసంస్థ మెటా నిర్ణయించింది. ట్విట్టర్ బ్లూ' పేరుతో పెయిడ్ వెరిఫికేషన్‌ను ట్విట్టర్ ఇటీవల అందుబాటులోకి తెచ్చిన నేపథ్యంలో మెటా ఈ నిర్ణయం తీసుకుంది. సబ్‌స్క్రిప్షన్ వెబ్‌లో నెలకు 11.99 డాలర్లుగా ప్రారంభమై, ఐఒఎస్ ప్లాట్ పారమ్‌లలో 14.99 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సేవలను ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో తొలుత ఈ వారం ప్రవేశపెడతారు. చెల్లింపు వినియోగదారులు తమ ప్రొఫైల్‌ను ప్రభుత్వ ఐడితో ధ్రువీకరించవచ్చు. ప్రొఫైల్ వెరిఫికేషన్‌తో పాటు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ కోసం సబ్‌స్క్రిప్షన్, అదనపు రక్షణను కూడా అందిస్తుంది.'ట్విట్టర్ బ్లూ' పేరుతో పెయిడ్ వెరిఫికేషన్‌ను ట్విట్టర్ అందుబాటులోకి తెచ్చింది. భారతీయ వినియోగదారుల కోసం వెబ్‌సైట్, మొబైల్‌లో వరుసగా రూ.650, రూ.900 చొప్పున చెల్లింపు సేవలు అందిస్తోంది. ట్విట్టర్ బ్లూ యూజర్లకు ఇతర యూజర్ల కంటే కొన్ని అదనపు ఫీచర్లను కల్పించింది.

చిరిగిన పుస్తకం

పదో తరగతి గదిలో అల్లరి బాగా వినిపించడంతో గోపయ్య మాస్టర్ వెళ్ళారు. తరగతి గదిలో పుస్తకాలన్నీ చిందరవందరగా ఉన్నాయి. విద్యార్థులందరూ ఒకరికి పుస్తకాలు మరొకరు చింపుకుంటూ, పేపర్లతో ఆడుతున్నారు. మాస్టర్ లోపలికి రావడంతో విద్యార్థులందరూ నిశ్శబ్దంగా తమ పుస్తకాలను తీసుకుని కూర్చున్నారు.



మాస్టర్ విద్యార్థుల చేతుల్లో చినిగిన పుస్తకాలను గమనించారు. ఏమీ అనకుండా క్లాస్ చెప్పి వెళ్ళిపోయారు. ఇంటికి వెళ్లాక ఆ పుస్తకాలు చింపుకోవడం గురించి రాత్రంతా ఆలోచించారు.

మరుసటి రోజు గోపయ్య మాస్టర్ మొదటి గంట కాగానే ఆ తరగతి గదిలోకి వెళ్ళారు. విద్యార్థులంతా 'మాస్టర్..! మీ చొక్కా బాగాలేదు. చినిగిపోయింది. మరకలు ఉన్నాయి' అన్నారు. పట్టించుకోకుండా మాస్టర్ విద్యార్థులకు పాఠం బోధించారు. పిరియడ్ సమయం పూర్తికాగానే మాస్టర్ తరగతి గది నుంచి వెళ్ళుతుంటే విద్యార్థులు మరోసారి 'మాస్టార్ మీ చొక్కాను మాకు చూడబుద్ధి కావడంలేదు' అన్నారు.


గోపయ్య మాస్టర్ చిరునవ్వుతో 'పిల్లలూ! చిన్న మరకలు, రంధ్రాలు ఉంటే నా చొక్కాను చూడలేకపోతున్నారు. మరి జ్ఞానాన్ని అందించే పాఠ్యపుస్తకాలను మీరు చింపుతుంటే నేనూ చూడలేకపోతున్నా. దుస్తులు చినగకుండా చూసుకున్నట్టే, పుస్తకాలనూ జాగ్రత్తగా చూసుకోవాలి. అదే విద్యార్థికి ఉండాల్సిన లక్షణం. అది మర్చిపోయి, మీరు అలా చేయడం నాకూ నచ్చలేదు' అన్నారు.

విద్యార్థులంతా తమ తప్పును తెలుసుకున్నారు. మరుసటి స్కూలుకు వస్తూ తమ పుస్తకాలకు అట్టలు వేశారు. చింపిన పేజీలను అతికించి తీసుకువచ్చారు. విద్యార్థుల్లో వచ్చిన మార్పును చూసి గోపయ్య మాస్టర్ సంతోషపడ్డారు.


– ఉండ్రాళ్ళ రాజేశం
99669 46084

బొమ్మ గీయండి!

చిన్నారులూ , ఈ రోజు అందమైన కోడి పుంజు బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.



నేను గీసిన బొమ్మ



ఎస్. నఫిషియ
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
యాదమరి, చిత్తూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA జీవన the family



నిరాశ్రయులకు ఆసరా..

పేదరికం నుంచి వచ్చిన ఆయన 'నాకు పేదల ఆకలి తెలుసు. సమాజం పట్ల బాధ్యతగా మెలగడం తెలుసు. విద్య విలువ తెలుసు' అంటారు. కడపజిల్లా కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పేద పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేయడం దగ్గర నుండి గ్రంథాలయాలు స్థాపించడం, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, రక్తదానం, విద్యా దానం, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడం ఇలా ఎక్కడ తన అవసరముంటుందో అక్కడ రెక్కలు కట్టుకుని వాలిపోతారు. తన గ్రామంలో తరతరాలుగా వస్తున్న కల్తీసారా తయారీ బట్టీలను, బెల్టుషాపులను తుడిచి పెట్టేయడంలో ఓ ఉద్యమమే చేశారు. గ్రామంలోని యువతనంతటినీ పోగేసి 250 కుటుంబాలు గల తన గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో ఎనలేని కృషి చేసి, ఎంతోమంది యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలిచారు.



వర్షం వస్తే తప్ప పంట పండని రెండెకరాల భూమి గల రామకృష్ణారెడ్డి అమ్మానాన్న మట్టిని నమ్ముకుని ఆకలితో పోరాటం చేసేవారు. పిల్లల కడుపు నింపాలని ఆ తల్లిదండ్రులు ఎన్నోసార్లు పస్తులు పడుకునేవారు. 'అంత పేదరికంలోనూ మా అమ్మ తన చెల్లి, బిడ్డను కని పదిరోజుల వ్యవధిలో చనిపోతే ఆ పసిపిల్ల బాధ్యత తీసుకుంద'ని గర్వంగా చెబుతారు రామకృష్ణారెడ్డి. అన్నం లేకపోయినా ఆదరణ ఇవ్వడంలో ఏమాత్రం వెనుకంజవేయని ఆ తల్లి లక్షణాలను పుణికిపుచ్చుకున్న ఆయన నేడు ఎంతోమందికి కొడుకుగా మారాడు. నిరాదరణకు గురైన వారిని అక్కున చేర్చుకుని వారి బాగోగులు చూసుకునేందుకు తన సంపాదనంతా ఖర్చు పెడుతున్నారు.

పనులు చేసి చదువుకున్నాను..

ఆర్థిక ఇబ్బందులతో అర్థంతరంగా చదువుకు స్వస్తిచెప్పిన రామకృష్ణారెడ్డి పదోతరగతి ఉత్తీర్ణత తరువాత రెండేళ్ల పాటు చిన్న చిన్న పనులు చేసేవారు. వార్డు బోయ్‌గా, రంగులు వేస్తూ ఉండేవారు. అయితే దిశానిర్దేశం లేకుండా అలా జీవించడం ఎంతమాత్రం ఇష్టంలేక మళ్లీ చదువుకొనసాగించాలని కాలేజీలో చేరారు. 'అమ్మానాన్నకు ఈ విషయం చెప్పినప్పుడు మా దగ్గర అంత స్థోమత లేదు నాయన. అని కన్నీళ్లు పెట్టుకున్నారు. మా చిన్నప్పుడు రోజువారీ ఖర్చుల కోసం అమ్మ ఇంటింటికీ వెళ్లి కూరగాయలు అమ్మేది. అలా చేస్తేనే మాకు తిండి, పుస్తకాలు వచ్చేవి. అందుకే ఇప్పుడు కాలేజీ చదువు అంటే వాళ్లు అంతలా భయపడుతున్నారు. అందుకే వాళ్లకి ఇబ్బంది కలిగించకుండా పనులు చేసి సంపాదించుకుంటూ నా చదువు కొనసాగించాను' అంటూ గత స్మృతులు గుర్తుచేసుకున్న ఆయన ఉన్నత విద్యలో మెరుగైన ప్రతిభతో రాణించారు.

వివేకానంద స్ఫూర్తి..

ఓ సారి రామకృష్ణ కాలేజీకి వివేకానంద అనుచరులు, రిటైర్ ప్రొఫెసర్ ఒకాయన వచ్చారు. 'ఆయన చెప్పిన వివేకానంద బోధనలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఏడాదిపాటు వివేకానంద పుస్తకాలు చదివాను.

సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని అప్పుడే సంకల్పించుకున్నాను. అలా కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడే స్నేహితులందరం ఒక బృందంగా ఏర్పడి రోడ్ల మీద నిరాశ్రయులకు ఆహారం ఇవ్వడం, ఆశ్రమాలకు తరలించడం, అవసరమైన వాళ్లకు రక్తదానం, పేద పిల్లలకు పుస్తకాల పంపిణీ చేసేవాళ్లం. ట్యూషన్లు చెబుతూ వచ్చిన పాకెట్ మనీతోనే ఇవన్నీ చేసేవాడిని.

గ్రామ పరిరక్షణ..

ఎక్కడెక్కడో సేవా కార్యక్రమాలు చేస్తున్న మేమంతా ముందుగా మా గ్రామాన్ని బాగుచేయాలనుకున్నాం. ఎందుకంటే అక్కడ 250 కుటుంబాలు ఉండేవి. కొంతమంది బృందాలుగా ఏర్పడి కల్తీ సారా కాసేవారు. నాలుగైదు బెల్టుషాపులు కూడా ఉండేవి. మత్తు త్వరగా ఎక్కాలని బెల్లంతో పాటు ప్లాస్టిక్ వస్తువులు, బాటా చెప్పు ముక్కలు వేసి కాసేవారు. అది తాగిన వారు చాలా త్వరగా అనారోగ్యం పాలయ్యేవారు. చిన్న వయసులోనే మరణించినవారు ఎంతోమంది. ఈ విషయాలన్నీ చిన్నప్పటి నుండి చూస్తున్న నేను గ్రామంలో సారా బట్టీలను మూసివేయాలని, బెల్టు షాపులను తొలగించాలని మా బృందంతో కలసి పెద్ద ఎత్తున పోరాడాం. బెదిరింపులు, ఇంట్లో వాళ్ల అభ్యంతరాలతో చివరికి నలుగురమే మిగిలాం. అయినా మా ప్రయత్నం ఆపలేదు. ఊళ్లో మహిళలు మాకు అండగా నిలబడ్డారు. ఇప్పుడు మా గ్రామంలో ఒక్క బెల్టు షాపు లేదు. ఇదంతా మీ చలవే అని గ్రామస్తులు మమ్మల్ని అభినందించడం చూసి అమ్మానాన్న ఎంతో సంతోషించారు.

కరోనా కలిచివేసింది..

ప్రభుత్వ స్కూల్లో చదివే విద్యార్థులకు ఏడాదికి 500 మందికి చొప్పున అన్ని తరగతుల వారికి ఆరేళ్లపాటు ఉచిత పుస్తకాలు, స్కూలు బ్యాగులు, అవసరమైన సామగ్రి పంపిణీ చేశాం. గ్రామంలో గ్రంథాలయం స్థాపించి విజయవంతంగా నిర్వహించాను. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఆసక్తి ఉన్న వాళ్లకు సహాయం అందించాను. 2010 నుండి వివేకానంద ఫౌండేషన్ పేరుతో ఎన్నో సేవాకార్యక్రమాలు చేసిన నేను కరోనా సమయంలో ఎంతోమంది అనాథలు తిండిలేక, ఆదరించే వారు లేక రోడ్డుమీదే మరణించడం చూసి చలించిపోయాను. అప్పటివరకు వైద్య చికిత్సలు అవసరమున్న ఎంతోమంది నిరాశ్రయులను ఆస్పత్రులకు తీసుకెళ్లడం, వారి బంధువులకు సమాచారం అందించడం చేసేవాడ్ని. అప్పటి వరకు నా ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చేవాడ్ని. కాని లాక్‌డౌన్‌లో వారి కోసం ప్రత్యేకంగా ఓ వసతి గృహం నిర్మించాలనుకున్నాను' అంటున్న రామకృష్ణకు రైల్వే గేట్‌మెన్‌గా వచ్చిన సంపాదనే జీవనాధారం. మొదట్లో సగం జీతం సేవాకార్యక్రమాలకు ఖర్చు పెట్టిన ఆయన ఆ తరువాత మొత్తం సంపాదన వినియోగించేస్తున్నారు.



వివేకానంద సేవాశ్రమం

'నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న ఆలోచనైతే ఉంది కాని ఎలా? నా దగ్గర అంత డబ్బు లేదు.. అప్పుడే ఓ పెద్దాయన నాకు స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో వసతి గృహం నిర్మించేందుకు నా భార్య నగలు తనఖాలో పెట్టాను. ఆ తరువాత ఎంతోమంది స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. ఇప్పుడు అన్ని వసతులతో 'వివేకానంద సేవాశ్రమం' పేరుతో ఆశ్రయం నిర్వహిస్తున్నాను. వీరితో పాటు నేనూ, నా భార్య, పిల్లలు ఇక్కడే ఉంటాం. వారికి వండిందే మేమూ తింటాం. ఇక్కడకు వచ్చే వారిలో అనాథలే కాదు, నిరాశ్రయానికి గురైనవారూ ఉన్నారు. పిల్లలున్నా రోడ్డు మీద పడ్డ తల్లిదండ్రులను చేరదీస్తాను. కొంతమందిని వారి పిల్లలకు కౌన్సిలింగ్ ఇప్పించి పంపిస్తాను. అనారోగ్యంతో శరీరం పుండ్లు పడి, దుర్వాసన వస్తున్న వారిని కూడా ఆదరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఎందరో వ్యక్తులు.. ఎన్నో సంఘటనలు నన్ను ప్రభావితం చేశాయి. నేను చేస్తున్న కార్యక్రమాలు నచ్చక శుభకార్యాలకు పిలవని సందర్భాలు కూడా ఉన్నాయి. దశాబ్దకాలం గడిచిపోతున్నా మొదటి రోజున ఏ దృఢనిశ్చయంతో ఉన్నానో... ఇప్పటికీ అలాగే ఉన్నాను. ఈ ప్రయాణంలో ఎదురుదెబ్బలే కాదు.. ప్రశంసలు, అవార్డులు కూడా ఉన్నాయి. ఇటీవలె కేంద్ర ప్రభుత్వం నుండి 'జనమంచి గౌరీశంకర్ యువపురస్కారం' లభించింది' అంటున్న రామకృష్ణారెడ్డి 'డబ్బు ఉండి ఈ పనులు చేయడం లేదు. నా ప్రయత్నంలో ఎందరో భాగస్వాములు.. నా తల్లిదండ్రులు, భార్యా పిల్లల సహకారం ఎంతో ఉంది. అనాథశవాల అంత్యక్రియల్లో నాతో పాటు నా భార్య కూడా పాల్గొంటుంది. బంధువులతో పాటు స్వచ్ఛంద విరాళాలు ఇస్తూ నన్ను ప్రోత్సహిస్తున్న ఎంతోమంది సహకారంతోనే ఇవన్నీ చేయగలుగుతున్నాను' అంటున్నారు.

– శ్రీజ్ఞ

అందాల తారలకు అరుదైన ఆరోగ్య సమస్యలు





ముఖంపై చిన్న మొటిమ ఉన్నా బయటికి తెలియకుండా, ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే అతి రహస్యంగా ఉంచే నటీమణులు ఇప్పుడు ఆ ధోరణికి స్వస్తిపలికారు. ముఖ్యంగా తమ ఆరోగ్య రహస్యాలను వెల్లడించేందుకు వెనుకంజ వేయడం లేదు. ఈ జాబితాలో మొట్టమొదటిగా సమంత గురించి చెప్పుకోవాలి. 'యశోద', 'శాకుంతలం', 'ఖుషి' సినిమా షూటింగుల్లో బిజీగా ఉన్న ఆమె హఠాత్తుగా 'మయోసైటిస్' వ్యాధి బారిన పడినట్లు చికిత్స తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. చిత్రరంగంలో అగ్ర కథానాయికగా ఉన్న సమంత తన అనారోగ్యం గురించి చెప్పడంలో చూపించిన చొరవ, సాహసం తారాలోకాన్ని నివ్వెరపరిచింది.

మితిమీరిన సౌందర్య ఉపకరణాలతో రకరకాల సైడ్ ఎఫెక్ట్‌తో చర్మ సంబంధిత వ్యాధులతో నటీమణులు సతమతమవ్వడం సాధారణంగా జరిగేదే. కాని గుండె, ఊపిరితిత్తులు, ఇతర అంతర్గత అవయవాల అసమతుల్య పనితీరుతో దీర్ఘకాల అనారోగ్య సమస్యలకు గురవ్వడం బాధాకరం. ఇటీవల రేణూదేశాయ్ తాను గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు, చికిత్స తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

'కొన్నాళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. దాన్ని ఫేస్ చెయ్యడానిక్కావల్సిన శక్తిని ఇప్పుడిప్పుడే కూడదీసుకుంటున్నా' అంటూ ఇన్‌స్టాలో ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. 'నాలాగే ఎవరైనా బాధపడుతుంటే వారిలో ధైర్యాన్ని, పాజిటివ్ ఎనర్జీని నింపడమే ఈ పోస్ట్ ఉద్దేశం. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోవద్దు. బలంగా నిలబడండి. ఈ ప్రపంచం మనకోసం ఎన్నో సర్‌ప్రైజ్‌లను ప్లాన్ చేసింది. నవ్వుతూ వాటి కోసం ఎదురుచూద్దాం' అంటూ పోస్టు చేశారు రేణుదేశాయ్.

ఇక అనుష్క తాజాగా ఓ రేర్ డెసీజ్‌తో బాధపడుతున్నానంటూ తన ఆరోగ్య రహస్యం వెల్లడించారు. 'పక్క వాళ్లు ఫీలవుతున్నా.. పిచ్చోళ్లలా అనుకుంటున్నా.. భయంతో పక్కకు పరిగెత్తినా.. 15, 20 నిమిషాల పాటు నవ్వుతూ ఉంటానని, ఆ సమయంలో ఎవరైనా ఆపడానికి ప్రయత్నించినా కూడా.. నవ్వు ఆగదని' స్వయంగా సోషల్‌మీడియా ద్వారా ఆమె వెల్లడించారు. 'ఈ జబ్బును కంట్రోల్ చేయడానికి ఎప్పటి నుంచో ప్రయత్నిస్తూనే ఉన్నాన'ని చెప్పారు. ఇది నరాల సంబంధిత వ్యాధని, పాతోలాజికల్ లాఫ్టర్ అండ్ క్రయింగ్ అని గూగుల్ సర్వే చెబుతోంది. దీని వల్ల బ్రెయిన్‌లో కొన్ని నరాలు దెబ్బతింటాయని, శాశ్వత పరిష్కారం లేదు కాని ఉపశమనం పొందే వీలుందని తెలుస్తోంది.









జ్ఞాపక శక్తి తగ్గిపోవటం, నిద్ర లేకపోవటం, త్వరగా అలసిపోవటం, కండరాల నొప్పి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలతో పూనమ్ కౌర్ బాధపడుతున్నట్లు గతంలో తెలిపారు. చికిత్స కోసం కేరళ ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నట్లు ఓ పోస్టు కూడా పెట్టారు.

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్లు, క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్నట్లు మమతా మోహన్‌దాస్, క్యాన్సర్ చికిత్సలో భాగంగా జుట్టంతా ఊడిపోయిన ఫొటో షేర్ చేసిన హంసనందినీ గతంలో తమ ఆరోగ్య వివరాలు వెల్లడించారు.

చిత్రరంగంలో ఎక్కువ కాలం

నిలదొక్కుకోవాలని హానికర సౌందర్య ఉపకరణాల వినియోగం, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ చూపించేందుకు శక్తికి మించి కసరత్తులు చేసే ఎంతోమంది తారలు అనారోగ్య సమస్యల బారిన పడడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ఆయా పాత్రల్లో నటించడం కోసం శరీర సౌష్టవాన్ని అమాంతం పెంచేసుకోవడం, తగ్గించడం వల్ల కూడా విపరీతమైన ఆరోగ్యసమస్యలు హీరోలను చుట్టుముడుతుంటాయి. ప్రభాస్, ఎన్‌టిఆర్, రానా వంటి అగ్రనటుల ఆరోగ్య పరిస్థితులపై గతంలో అనేక వార్తలు వచ్చాయి కూడా. ఏదేమైనా నటీనటులకు ఆరోగ్యంపై శ్రద్ధ చాలా అవసరమని తాజా పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

జడేజా మ్యాజిక్ ఆసీస్ కుదేల్...



రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియాపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు
బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీమిండియాకు 2-0 ఆధిక్యత

న్యూఢిల్లీ: రవీంద్ర జడేజా కెరీర్ బెస్ట్ బౌలింగ్(7/42)తో చెలరేగడంతో ఆస్ట్రేలియా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో పేకమేడలా కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 61పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు 113పరుగులకే ఆలౌటైంది. దీంతో 115పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 26.4 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారతజట్టు 2-0 ఆధిక్యతలో నిలిచింది. ఓపెనర్ రోహిత్ శర్మ 20 బంతుల్లో 31 పరుగులు చేసి రనౌట్ కాగా.. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ మరోసారి విఫలమయ్యాడు. కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి నాథన్ లియాన్ బౌలింగ్‌లో అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత చటేశ్వర్ పుజారా 100వ టెస్ట్‌లో నిదానంగా ఆడి 74 బంతుల్లో 31 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. విరాట్ కోహ్లి(20), శ్రేయాస్ అయ్యర్(12) పరుగులు చేసి ఔటయ్యారు. చివర్లో ఆంధ్ర కుర్రాడు శ్రీకర్ భరత్ 22 బంతుల్లో 23 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు, ఓవర్ నైట్ స్కోరు వికెట్ నష్టానికి 61పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 54 పరుగులు మాత్రమే జోడించి 9వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ మాయాజాలానికి ఆసీస్ బ్యాటర్స్ క్రీజ్‌లో నిలువలేకపోయారు. జడేజాకు ఏడు, అశ్విన్‌కు మూడు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 263 పరుగులు చేస్తే.. భారత్ 262 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రవీంద్ర జడేజాకు లభించింది.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 264పరుగులు, భారత్ తొలి ఇన్నింగ్స్: 263పరుగులు

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖవాజా (సి)శ్రేయస్ (బి)జడేజా 6, హెడ్ (సి)శ్రీకర్ భరత్ (బి)అశ్విన్ 43, లబూషేన్ (బి)జడేజా 35, స్టీవ్ స్మిత్ (ఎల్‌బి)అశ్విన్ 9, రెన్‌షా (ఎల్‌బి)అశ్విన్ 2, హ్యాండ్‌కోంబ్ (సి)కోహ్లి (బి)జడేజా 0, క్యారీ (బి)జడేజా 7, కమిన్స్ (బి)జడేజా 0, లియాన్ (బి)జడేజా 8, మర్ఫీ (నాటౌట్) 3, కుహ్నేమన్ (బి)జడేజా 0, అదనం 0. (31.1ఓవర్లలో ఆలౌట్) 113పరుగులు.

వికెట్ల పతనం: 1/23, 2/65, 3/85, 4/95, 5/95, 6/95, 7/95, 8/110, 9/113, 10/113

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (రనౌట్) హ్యాండ్‌కోంబ్/క్యారీ 31, కేఎల్ రాహుల్ (సి)క్యారీ (బి)లియాన్ 1, పుజారా (నాటౌట్) 31, కోహ్లి (స్టంప్)క్యారీ (బి)మర్ఫీ 20, శ్రేయస్ (సి)మర్ఫీ (బి)లియాన్ 12, శ్రీకర్ భరత్ (నాటౌట్) 23, అదనం 0, (26.4ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 118పరుగులు.

వికెట్ల పతనం: 1/6, 2/39, 3/69, 4/98

బౌలింగ్: కుహ్నేమన్ 7-0-38-0, లియాన్ 12-3-49-2, మర్ఫీ 6.4-2-22-1, హెడ్ 1-0-9-0

కెఎల్ రాహుల్‌కు అవకాశం

- వన్డే జట్టులో జడేజాకు చోటు
- మిగిలిన టెస్టులకు, వన్డే సిరీస్‌కు జట్ల ప్రకటన

ముంబయి: తొలి రెండు టెస్టుల్లో ఘోరంగా విఫలమైన కేఎల్ రాహుల్‌పై బిసిసిఐ నమ్మకముంచింది. ఆస్ట్రేలియాతో జరిగే మూడు, నాలుగు టెస్టులకు కేఎల్ రాహుల్‌కు చోటు కల్పించింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన తొలి రెండు టెస్టుల్లో భారత్ గెలిచి 2-0 ఆధిక్యతలో ఉండగా.. మిగిలిన రెండు టెస్టులు ఇండోర్, అహ్మదాబాద్ వేదికలు వచ్చే నెలలో జరగనున్నాయి. మూడో టెస్ట్ మార్చి 1నుంచి, ప్రారంభం కానుండగా.. రంజీట్రోఫీ టైటిల్‌ను నెగ్గిన సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనాద్కట్ మూడో టెస్ట్‌కు జట్టుకు అందుబాటులోకి రానున్నాడు. ఇక మూడు వన్డేల సిరీస్ 17నుంచి ప్రారంభం కానుంది.

మూడు, నాలుగు టెస్టులకు జట్టు..

రోహిత్ శర్మ(కెప్టెన్), కేఎల్ రాహుల్, పుజారా, కోహ్లి, శ్రీకర్ భరత్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, శ్రేయస్, సూర్యకుమార్, ఉమేశ్, ఉనాద్కట్.

వన్డే సిరీస్‌కు జట్టు..

రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), హార్దిక్(వైస్ కెప్టెన్), జడేజా, కుల్దీప్, సుందర్, చాహల్, షమీ, సిరాజ్, ఉమ్రన్ మాలిక్, శార్దూల్, అక్షర్, ఉనాద్కట్.

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ : 17 : తొలి వన్డే(ముంబయి)
19 : రెండో వన్డే(విశాఖ) 22 : మూడో వన్డే(చెన్నై)



రంజీ ట్రోఫీ విజేత సౌరాష్ట్ర

ఫైనల్లో బెంగాల్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపు

కోల్‌కతా: ప్రతిష్టాత్మక రంజీట్రోఫీ2022-23 టైటిల్‌ను సౌరాష్ట్రజట్టు వరుసగా రెండోసారి సొంతం చేసుకుంది. ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు 9వికెట్ల తేడాతో బెంగాల్ జట్టుపై ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 164పరుగులతో ఆదివారం నాల్గోరోజు ఆటను కొనసాగించిన బెంగాల్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 241పరుగులకు ఆలౌటైంది. దీంతో సౌరాష్ట్ర జట్టు 12పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఛేదించాల్సి వచ్చింది. ఆ లక్ష్యాన్ని సౌరాష్ట్ర జట్టు 2.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 14పరుగులు చేసి రంజీ ట్రోఫీ టైటిల్‌ను చేజిక్కించుకుంది. బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులు చేయగా.. సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 404 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్ బ్యాటర్లలో కెప్టెన్ మనోజ్ తివారి(68), అనుస్తుప్ మజుందార్(61) మాత్రమే రాణించారు. ముకేశ్ కుమార్‌కు నాలుగు, ఇషాన్ పోరెల్, అక్షదీప్ చెరో మూడు వికెట్లు దక్కాయి. ఉనద్కత్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. రంజీట్రోఫీ టైటిల్‌ను సౌరాష్ట్ర జట్టు గెలుచుకోవడం ఇది నాల్గోసారి. ఇక బెంగాల్ 15సార్లు ఫైనల్‌కు చేరుకోగా.. 14సార్లు రన్నరప్‌గానే నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68